Follow: @ANNTELUGU
ANN తెలుగు
01-07-2025
# మహా పత్రిక
మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 207 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## సార్క్‌కు పోటీగా చైనా-పాక్ కొత్త కూటమి?

**మహా:** సార్క్'కు ప్రత్యామ్నాయంగా దక్షిణాసియాలో కొత్త ప్రాంతీయ కూటమి ఏర్పాటు కాబోతోందా? ఈ దిశగా పాకిస్థాన్, చైనా కసరత్తు చేస్తున్నాయా? అంటే ఔను అనే సమాధానమే వినిపిస్తోంది. ఈ మేరకు వివరాలతో పాకిస్థాన్‌కు చెందిన ఓ వార్తాపత్రిక సంచలన కథనాన్ని ప్రచురించింది. పాక్ దౌత్యవర్గాలే తమకు ఈ సమాచారాన్ని అందించాయని వెల్లడించింది. కొత్త ప్రాంతీయ కూటమి ఏర్పాటుపై పాక్, చైనాలు ప్రస్తుతం అత్యున్నత స్థాయి చర్చలు జరుపుతున్నాయని ఆ వార్తా నివేదిక తెలిపింది.

మిగతా 3లో

టాప్ న్యూస్



### రాష్ట్రంలో గుడిసెలు ఉండొద్దు
- ఇప్పటివరకు 3 లక్షల ఇండ్ల మంజూరు
- పేదలకు గృహవసతి కల్పించడంలో దేశానికే తల మానికం
- రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ఇందిరమ్మ ఇండ్లపై అధికారులతో మంత్రి సమీక్ష

02



### బీజేపీకి ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామా
- హైకమాండ్ సీరియస్.. ఆమోదించే యోచన

02



### యుద్ధానికి సిద్ధం.. పాదయాత్ర చేస్తా...
- ఎంపీ ఈటల రాజేందర్

02



## బనకచర్లకు బ్రేక్.. ఏపీకి కేంద్రం షాక్

# రేవంత్ సర్కార్ మరో విజయం

### బనకచర్లకు అనుమతులు ఇవ్వలేమని తేల్చేసిన కేంద్ర పర్యావరణ కమిటీ

- ఫలించిన ముఖ్యమంత్రి రేవంత్, మంత్రి ఉత్తమ్ ఒత్తిడి
- అఖిలపక్ష ఎంపీల భేటీతో పాటు కేంద్రమంత్రులను కలిసి వివరణ
- జాతీయస్థాయిలో బనకచర్ల అన్యాయాన్ని ప్రస్తావించిన రేవంత్
- బనకచర్ల నిర్మిస్తే భద్రాచలం, మణుగూరు, దుమ్ముగూడెం మునకే

హైదరాబాద్, మహా : బనకచర్లను అడ్డుకుని తీరుతామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్రంపై వ్యూహాత్మక ఒత్తిడి ద్వారా తొలి విజయం సాధించారు. బనకచర్ల వ్యవహారంలో మొండిగా ముందుకెళ్ళిన ఏపీకి భారీ షాక్ తగలగా.. తెలంగాణకు ఊరట లభించింది. బనకచర్ల వ్యవహారంపై కేంద్ర జలశక్తితోపాటు పలు శాఖల మంత్రులకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సోదాహరణగా వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్రంపై తీసుకువచ్చిన ఒత్తిడి ఫలించింది. ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదించిన పోలవరం- బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వలేమని కేంద్రం ఏపీకి తేల్చి చెప్పింది. పోలవరం- బనకచర్లకు అనుమతులు ఇవ్వలేమని కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ స్పష్టం చేసింది. బనకచర్ల ప్రాజెక్టుపై అనేక అభ్యంతరాలు వచ్చాయని తెలిపింది. అనుమతులు ఇవ్వాలంటే జీడబ్ల్యూడీటీ అవార్డు పరిశీలించాల్సి ఉందన్న కేంద్ర కమిటీ వివరించింది. పర్యావరణ అనుమతులకు సీడబ్ల్యూసీని సంప్రదించడం తప్పనిసరని వెల్లడించింది

వివరాలు 3లో

# బీజేపీ చీఫ్‌గా రామచందర్ రావు

## అందరివాడనే ఆమోదం

### అఖరి నిమిషంలో బీజేపీ హైకమాండ్ ట్విస్ట్
### ఎన్ఆర్ఆర్ నియామకంపై సీనియర్ల హ్యాపీ.. పార్టీ శ్రేణుల హర్షం

**బిజెపి హైకమాండ్.. స్టేట్ చీఫ్ ఎంపికలో చివరిదాకా సస్పెన్స్ కొనసాగించి అనూహ్యంగా ట్విస్ట్ ఇచ్చింది. రెండేళ్ళుగా నాన్చినా చివరికి అందరివాడికే పట్టం కట్టింది. తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షునిగా ఎన్. రామచంద్రరావు ఎన్నికయ్యారు. అధ్యక్ష ఎన్నిక నామినేషన్ గడువు ముగిసే సమయానికి.. ఒకే ఒక్క నామినేషన్ దాఖలు అయ్యింది. అది కూడా రామచంద్రరావుదే. దీంతో అధ్యక్షుని ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. ఈ విషయాన్ని కేంద్ర అధిష్టానం అధికారింగా ప్రకటించాల్సి ఉంది. ఎంపిక మాత్రం లాంఛనమే. ముందుగా అనుకున్నట్లే.. రామచంద్రరావు ఎంపికను డిసైడ్ చేయించి.. ఆ తర్వాత ఒకే ఒక్క నామినేషన్ దాఖలు అయ్యే విధంగా పార్టీ చూసింది. మధ్యలో మరో ఎమ్మెల్యే రాజాసింగ్ పోటీకి ప్రయత్నించినా.. ఆ తర్వాత ఆయన విరమించుకుని.. ఏకంగా పార్టీకే రాజీనామా చేశారు.** - మహా, హైదరాబాద్,

**ఉదయం ఫోన్**

తెలంగాణ బీజేపీ అధ్యక్ష ఎన్నికకు పార్టీ హైకమాండ్ సోమవారం నామినేషన్లు స్వీకరించింది. హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ఎన్నిక ఇంచార్జులు నామినేషన్లు స్వీకరించారు. సాయంత్రం 5 గంటలకు నామినేషన్ దాఖలకు గడువు ముగిసింది. సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ ఎన్ రామచందర్ రావు ఒక్కరే అధ్యక్ష ఎన్నికకు నామినేషన్ దాఖలు చేశారు. రామచందర్ రావు నామినేషన్ దాఖలు చేసే కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పార్టీ హైకమాండ్ సోమవారం ఉదయం 10గంటల ప్రాంతంలో రామచందర్‌ను తదుపరి పార్టీ చీఫ్‌గా ఎన్నిక చేయాలని డిసైడ్ అయి న నామినేషన్ దాఖలు చేయాల్సిందిగా సూచించింది. అధిష్టానం ఆదేశాల మేరకు ఇతర నేతలు ఎవరు నామినేషన్ వేయకుండా ఎన్నిక ఏకగ్రీవం అయ్యేందుకు సహకరించారు. బీజేపీ అధ్యక్ష ఎన్నిక రేసులో మొదటి నుంచి ముందు వరుసలో ఉన్న ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్ చివర్లో రేసు వైదొలిగారు.



మిగతా 3లో

### అభివృద్ధి ప్రచారంలో సమాచార శాఖదే కీలక పాత్ర
ప్రత్యేక కమిషనర్ సిహెచ్ ప్రియాంక



02



### సమస్యలను పరిష్కరించడంలో ముందుంటాం
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. సీఎంను కలిసిన సీపీఐ నేతలు

హైదరాబాద్, మహా: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సీపీఐ నాయకులు, ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డితో పాటు పలువురు నేతలు ముఖ్యమంత్రి జూబ్లీహిల్స్ నివాసంలో కలిశారు. గ్రామ పంచాయతీ కార్మికులు, అంగన్ వాడీ, ఆర్టీసీతో పాటు పలు ప్రజా సమస్యలపై వారు ఈ సందర్భంగా ముఖ్యమంత్రితో చర్చించారు. అలాగే, పలు అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలను వివరించారు.



### ఐదు దేశాల పర్యటనకు మోదీ
- రేపటి నుంచి ఎనిమిది రోజుల పాటు పర్యటనలు
- ఘనా, ట్రినిడాడ్, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియాల సందర్శన
- బ్రెజిల్‌లో జరగనున్న 17వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు హాజరు

02



## కెమికల్ ఫ్యాక్టరీలో పేలిన బతుకులు
### 16 మంది మృతి.. మరో 12 మందికి తీవ్ర గాయాలు
- ఇంకా లభించని అనేకమంది ఆచూకీ
- పాశమైలారంలోని సిగాచి రసాయన పరిశ్రమలో ఘటన
- ప్రమాద ధాటికి 100 మీటర్ల దూరంలో ఎగిరిపడ్డ కార్మికులు
- విచారం వ్యక్తం చేసిన ప్రధాని మోదీ, సీఎం రేవంత్
- ఘటనాస్థలికి హుటాహుటిన మంత్రులు దామోదర రాజనర్సింహ, వివేక్
- అర్ధరాత్రి దాకా సహాయ చర్యల పర్యవేక్షణ
- తమ వారి ఆచూకీ తెలపాలంటూ కుటుంబీకుల ఆవేదన

02

### తెలంగాణ అంగన్‌వాడీలు దేశానికి రోల్‌మోడల్‌గా నిలవాలి
సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

వివరాలు 3లో



# కెమికల్ ఫ్యాక్టరీలో పేలిన బతుకులు

## 16 మంది మృతి.. మరో 12 మందికి తీవ్ర గాయాలు

ఇంకా లభించని అనేకమంది ఆచూకీ

పాశమైలారంలోని సిగాచి రసాయన పరిశ్రమలో ఘటన

ప్రమాద ధాటికి 100 మీటర్ల దూరంలో ఎగిరిపడ్డ కార్మికులు

విచారం వ్యక్తం చేసిన ప్రధాని మోదీ, సీఎం రేవంత్

ఘటనాస్థలికి హుటాహుటిన మంత్రులు దామోదర రాజనర్సింహ, వివేక్

అర్ధరాత్రి దాకా సహాయ చర్యల పర్యవేక్షణ

తమ వారి ఆచూకీ తెలపాలంటూ కుటుంబీకుల ఆవేదన



### హుటాహుటిన మంత్రులు

**సీగాచి పరిశ్రమలో జరిగిన ఘోర పేలుడు స్థలాన్ని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, కార్మిక శాఖాఆ మంత్రి వివేక్ లు పరిశీలించారు. పేలుడులో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్య సాయాన్ని అందించాల్సిందిగా జిల్లా కలెక్టర్ ను మంత్రులు ఆదేశించారు. వెంటనే పేలుడు జరిగిన ఫ్యాక్టరీ స్థలంలో సహాయక చర్యలు చేపట్టాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పంకజ్ ఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్లలో పాల్గొన్నారు. అర్ధరాత్రి వరకు మంత్రి ఘటనాస్థలం లోనే ఉండి సహాయ చర్యలు పరిశీలించారు.**

**సంగారెడ్డి, మహా:** తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచి కెమికల్ ఫ్యాక్టరీలో సోమవారం ఘోర ప్రమాదం జరిగింది. భారీ పేలుడు సంభవించి కొందరు కార్మికులు అక్కడికక్కడే మరణించగా, మరికొందరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఇప్పటివరకు మొత్తం 16 మంది మరణించారు. మరో 35 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. మంటలను ఆర్పడానికి, సహాయక చర్యల కోసం 11 అగ్నిమాపక యంత్రాలు, పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఇంకా బాధితుల సంఖ్య పెరిగే అవకాశముండగా, అనేకమంది ఆచూకీ లభించకపోవడంతో తీవ్ర ఆందోళన నెలకొంది. అయితే మిగిలిన 111 మంది జాడ ఇంతవరకు తెలియలేదన్న ప్రచారం సాగుతోంది. తమ వాళ్లు కనిపించడం లేదని కార్మికుల కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ ప్రమాదం జరిగిన సమయంలో పరిశ్రమలో 108 మంది కార్మికులు ఉన్నట్లు కంపెనీ వర్గాలు చెబుతున్నాయి. మూడు అంతస్తుల భవనం పూర్తిగా కుప్పకూలిపోవడంతో శిథిలాల కింద ఇంకా కార్మికులు చిక్కుకున్నారని తెలుస్తోంది. రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతున్నప్పటికీ వర్షం కారణంగా పనులకు ఆటంకం కలుగుతున్నట్లు తెలుస్తోంది.

**పరిశ్రమ వద్ద తీవ్ర ఉద్రిక్తత..**

పరిశ్రమ వద్ద ఉద్రిక్తత నెలకొంది. పరిశ్రమలోకి చొచ్చుకెళ్లేందుకు కార్మికుల కుటుంబాలు ఒక దశలో యత్నించాయి. తమ వారి ఆచూకీ తెలపాలంటూ బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. వారిని పరిశ్రమలోకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, కుటుంబ సభ్యుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. కాగా, ఘటనాస్థలి వద్ద కుటుంబాల రోదనలు మిన్నంటాయి. మరోవైపు మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. పలువురు కార్మికులు ఇంకా పరిశ్రమలోనే చిక్కుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో పరిశ్రమలో 108 మంది కార్మికులు ఉన్నట్లు కంపెనీ వర్గాలు చెబుతున్నాయి. అయితే గాయపడి.. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. వారికి ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు.

**ప్రమాద వివరాలు..**

సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచి ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఉత్పత్తి యూనిట్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. మైక్రో క్రిస్టలైన్ సెల్యులోజ్, ఇతర ఫార్మా ఎక్సిపియంట్స్, ఆహార పదార్థాలను తయారు చేసే ప్రముఖ సంస్థ ఇది. "ఐదుగురు కార్మికులు అక్కడికక్కడే మరణించగా, మరో ముగ్గురు పటాన్‌చెరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు" అని పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ అధికారి తెలిపారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని ఆయన అన్నారు. కానీ తర్వాత ఇది చాలా పెద్ద ప్రమాదమని తేలింది. "పేలుడు ధాటికి పారిశ్రామిక షెడ్డు పూర్తిగా ధ్వంసమైంది... పేలుడు తీవ్రత ఎంతగా ఉందంటే, కొంతమంది కార్మికులు సుమారు 100 మీటర్ల దూరం ఎగిరిపడ్డారు" అని కార్మికులను ఉటంకిస్తూ అధికారి తెలిపారు. ఒక భవనం కుప్పకూలగా, పక్కనే ఉన్న మరో భవనం పాక్షికంగా దెబ్బతింది. "దాదాపు కార్మికులందరూ యూనిట్ నుండి బయటకు పరుగులు తీశారు, కానీ కొందరు కార్మికులు ఇంకా లోపల చిక్కుకొని ఉండవచ్చని భయపడుతున్నారు" అని ఆయన చెప్పారు.

**రియాక్టర్ కారణం కాదు**

కాగా సిగాచి పరిశ్రమలో ప్రమాదానికి రియాక్టర్ పేలడం వల్ల కాదని.. వేడి గాలి అధిక ఒత్తిడి వల్లే భారీ పేలుడు సంభవించిందని అధికారులు అంటున్నారు. పరిశ్రమలో మైక్రో సెల్యులస్ పౌడర్ తయారు చేస్తున్న క్రమంలో బాయిలర్ నుంచి వచ్చే వేడి గాలికి పైప్‌లైన్ వ్యవస్థలో ఆటంకాలు ఏర్పడినప్పుడు పేలుడు సంభవించినట్లు తెలిపారు. వేడి గాలి తాకిడికి భవనం కుప్పకూలిందన్నారు. పేలుడు ధాటికి గోడలు బద్దలై పరిశ్రమలోకి వస్తున్న ప్లాంట్ ఇన్‌చార్జ్‌పై పడి అక్కడికక్కడే మృతి చెందినట్లు చెప్పారు. భవన శకలాలు చుట్టుపక్కల పరిశ్రమలోకి దూసుకెళ్లాయన్నారు. పరిశ్రమలో రియాక్టర్లు భద్రంగానే ఉన్నట్లు అధికారులు తేల్చారు.

**విచారం వ్యక్తం చేసిన ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డి**

సంగారెడ్డి ఫ్యాక్టరీ ప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చాలా మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. తమ ప్రియమైన వారిని కోల్పోయిన వారికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. మృతుల బంధువులకు పీఎంఎన్ఆర్ఎఫ్ నుండి రూ. 2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50,000 ఎక్స్ గ్రేషియా అందిస్తాం'' అని ప్రధాని మోదీ తెలిపారు.

**ఎప్పటికపుడు ఆరా తీసిన సీఎం రేవంత్ రెడ్డి**

భారీ అగ్ని ప్రమాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో చిక్కుకున్న కార్మికులను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ప్రమాదంపై ఎప్పటికపుడు ఆరా తీయడంతో పాటు భవిష్యత్ లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండ విచారించి నివేదిక అందజేయాలని నిపుణుల కమిటీని నియమించారు.

# ఐదు దేశాల పర్యటనకు మోదీ

## రేపటి నుంచి ఎనిమిది రోజుల పాటు పర్యటనలు

ఘనా, ట్రినిడాడ్, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియాల సందర్శన

బ్రెజిల్‌లో జరగనున్న 17వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు హాజరు



**ఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ ఎనిమిది రోజుల పాటు ఐదు దేశాల్లో పర్యటించనున్నారు. జులై 2 నుంచి ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియాల్లో ఆయన పర్యటిస్తారని కేంద్ర విదేశాంగ శాఖలోని ఆర్థిక సంబంధాల కార్యదర్శి దమ్ము రవి వెల్లడించారు. ఐదు దేశాల పర్యటనలో భాగంగా తొలుత జులై 2, 3 తేదీల్లో ఘనాలో పర్యటిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఘనా అధ్యక్షుడితో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు జరుపుతారన్నారు. ఇరు దేశాల ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని సమీక్షించి.. ఆర్థిక, ఇంధన, రక్షణ సహకారంపై భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు ఉన్న అవకాశాలపై నేతలిద్దరూ చర్చించే అవకాశం ఉన్నట్లు తెలిపారు.

**పర్యటించడం ఇదే ప్రథమం..**

ఈసారి జరగనున్న సుదీర్ఘ పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ తొలుత జులై 2, 3 తేదీల్లో ఘనాలో పర్యటిస్తారు. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఘనాలో భారత ప్రధాని పర్యటించడం ఇదే ప్రథమం. ఈ పర్యటన సందర్భంగా మోదీ.. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని సమీక్షించనున్నారు. ఆర్థిక, ఇంధన, రక్షణ సహకారం తదితర అంశాలపై ఆ దేశాధ్యక్షుడితో చర్చిస్తారని విదేశాంగ శాఖ తెలిపింది. అనంతరం ప్రధాని ట్రినిడాడ్ అండ్ టొబాగొలలో జులై 3, 4 తేదీల్లో పర్యటించనున్నారు. 1999 తర్వాత ఈ దేశంలో భారత ప్రధాని పర్యటించడం ఇదే తొలిసారి. అనంతరం జులై 4న అర్జెంటీనాకు వెళ్లనున్న ప్రధాని మోదీ.. 5వ తేదీ వరకు అక్కడే పర్యటిస్తారు. రక్షణ, వ్యవసాయం, మైనింగ్, చమురు, గ్యాస్, పునరుత్పాదక ఇంధనం, వాణిజ్యం, పెట్టుబడులు వంటి కీలక రంగాల్లో ఇరు దేశాల భాగస్వామ్యాన్ని మరింత పెంపొందించే అంశంపై అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలేతో విస్తృత చర్చలు జరుపుతారు. ప్రధాని ద్వైపాక్షిక పర్యటన భారత్, అర్జెంటీనా మధ్య బహుముఖ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింతగా బలోపేతం చేస్తుందని విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది.

**17వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు హాజరుకానున్న మోదీ..**

అనంతరం బ్రెజిల్‌లో 5నుంచి 8వ తేదీ వరకు ప్రధాని మోదీ పర్యటిస్తారు. బ్రెజిల్‌లోని రియో వేదికగా జరగనున్న 17వ బ్రిక్స్ సదస్సులో పాల్గొని ప్రపంచంలో పలు అంశాలపై అభిప్రాయాలను పంచుకోనున్నారు. ప్రపంచ పాలనా సంస్కరణలు, శాంతి, కృత్రిమ మేధస్సును బాధ్యతాయుతంగా ఉపయోగించడం, వాతావరణం, ప్రపంచ ఆరోగ్యం, ఆర్థిక అంశాలతో పాటు పలు కీలక అంశాలను ప్రస్తావించే వకాశం ఉంది. అలాగే, ఈ సదస్సు నేపథ్యంలోనే పలువురు దేశాధినేతలతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉంది. అనంతరం 9న నమీబియాకు వెళ్లి.. ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. నమీబియా పార్లమెంటులోనూ ప్రధాని ప్రసంగించే అవకాశం ఉన్నట్లు సమాచారం. నమీబియాలో ప్రధాని పర్యటన ఆ దేశంతో భారత్‌కు ఉన్న బహుముఖ, లోతైన చారిత్రక సంబంధాలను పునరుద్ఘాటిస్తోందని విదేశాంగ శాఖ పేర్కొంది.

# యుద్ధానికి సిద్ధం.. పాదయాత్ర చేస్తా

## ఎంపీ ఈటల రాజేందర్



**హైదరాబాద్ సిటీ, మహా:** ప్రజాసమస్యలపై పాదయాత్ర చేస్తానని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. పేదల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వంపై యుద్ధం చేస్తానని చెప్పారు. పెద్దలను వదిలేసి పేదలను రోడ్డున పడేస్తున్న హైడ్రాను సహించేదిలేదన్నారు. దమ్ముంటే బడాబాడుల ఇండ్లు కూలగొట్టాలని సవాల్ చేశారు. జవహర్ నగర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోరుబాట కార్యక్రమంలో ఈటల రాజేందర్ సంచలన కామెంట్స్ చేశారు. బస్తీల మీద పడి ఇల్లు కూలగొడుతున్నారు. వారికి అండగా పక్షి లెక్క తిరుగుతున్న. హైడ్రాను ఆహా ఓహో అన్న వాళ్లకు మూడు నెలలు అయ్యాక అర్థం అయ్యింది. వారు కూలగొట్టింది పెద్దలవి కావు పేదలవి అని అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

# రాష్ట్రంలో గుడిసెలు ఉండొద్దు

## ఇప్పటివరకు 3 లక్షల ఇండ్ల మంజూరు

పేదలకు గృహవసతి కల్పించడంలో దేశానికే తల మానికం

రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఇందిరమ్మ ఇండ్లపై అధికారులతో మంత్రి సమీక్ష




**హైదరాబాద్, మహా:** నిరుపేదలకు గృహ వసతి కల్పించడంలో భారత దేశంలోనే తెలంగాణ రాష్ట్రం తలమానికంగా నిలిచేలా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. దేశంలో ఏ ప్రభుత్వం కూడా 5 లక్షల రూపాయలతో ఇండ్లను నిర్మించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే ఇండ్లతో సంబంధం లేకుండా రాష్ట్రంలో అర్హులైన ప్రతిఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్నామని వెల్లడించారు. పేదవాడికి మరింత చేయూత ఇవ్వాలన్న ఆశయంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఒక్కో ఇంటికి 40 మెట్రిక్ టన్నుల ఇసుకను ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లపై సోమవారం మంత్రి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేదవారికోసం ఇందిరమ్మ ఇండ్లు నిర్మించడం ద్వారా రాష్ట్రంలో గుడిసెలు అనేవి లేకుండా చేయాలన్నదే ఈ ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమన్నారు. స్వరాష్ట్రంలో సొంత ఇంటి కోసం నిరుపేదలు కన్న కలలు గత ప్రభుత్వ నిర్వాకం వల్ల కలగానే మిగిలిపోయాయన్నారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం పేదలు కన్న కలలను సాకారం చేస్తోందన్నారు.

**ఇప్పటి వరకు 3 లక్షల ఇండ్లు మంజూరు..**

ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గానికి 3,500 ఇండ్ల చొప్పున 22,500 కోట్ల రూపాయలతో 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని ఈ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, ఇప్పటి వరకు 3 లక్షల ఇండ్లను మంజూరు చేశామని, ఇందులో 1 లక్షా 23 వేల ఇండ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణ బిల్లుల కోసం లబ్ధిదారులు ఎదురు చూడాల్సిన పరిస్దితి లేకుండా ప్రతి సోమవారం నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకే నిధులను జమచేస్తున్నట్లు వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, నిర్మాణంలో కొన్ని జిల్లాల పనితీరు మెరుగుపడాల్సిన అవసరం ఉందని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియ కొలిక్కివచ్చిన నేపథ్యంలో పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై దృష్టి సారించాలని, ఇందుకు అవసరమైన స్థలాలను గుర్తించాలని, వీలైనంత త్వరలో పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన కార్యాచరణను రూపొందించాలని అధికారులకు సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు వరంగల్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, కరీంనగర్, నల్గొండ, తదితర పట్టణాలలో కూడా ఇదే విధానాన్ని అమలుచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

# నక్సలిజాన్ని అంతం చేయలేరు

- అమిత్ షా వ్యాఖ్యలు హాస్యాస్పదం
- చర్చలు జరపబోమనడం ప్రభుత్వ వైఖరికి నిదర్శనం
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మండిపాటు




**హైదరాబాద్, మహా:** నక్సలిజం నిర్మూలనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీశాయి. నిజామాబాద్ పర్యటనలో షా చేసిన ప్రకటనపై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఘాటుగా స్పందించారు. నక్సలైట్లను చంపగలరేమో కానీ, నక్సలిజాన్ని మాత్రం అంతం చేయలేరని ఆయన అన్నారు. ఈ మేరకు ఈరోజు ఆయన ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. వచ్చే ఏడాది మార్చి నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా అంతం చేస్తామని అమిత్ షా చెప్పడం హాస్యాస్పదంగా ఉందని నారాయణ ఎద్దేవా చేశారు. ప్రభుత్వ విధానాలు మారనంత వరకు ఇలాంటి సమస్యలు పరిష్కారం కావని ఆయన అభిప్రాయపడ్డారు. నక్సలైట్లతో చర్చలు జరపబోమని చెప్పడం కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.

**ఆయుధాలు వీడేంత వరకు..**

నిజామాబాద్ జిల్లాలో పర్యటించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా, నక్సలిజంపై కీలక వ్యాఖ్యలు చేశారు. నక్సలైట్లు తక్షణమే హింసను వీడి, ఆయుధాలు పక్కనపెట్టి జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు. వారు ఆయుధాలు వీడేంత వరకు వారితో ఎలాంటి చర్చలు ఉండవని తేల్చిచెప్పారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు 10 వేల మంది నక్సలైట్లు లొంగిపోయారని ఆయన గుర్తుచేశారు. "గిరిజన బిడ్డలను, పోలీసులను నక్సలైట్లు చంపినప్పుడు వారి తరపున ఎవరూ మాట్లాడలేదు. కానీ ఇప్పుడు మాత్రం చర్చల కోసం చాలా మంది ముందుకొస్తున్నారు" అని కొందరి వైఖరిని దుయ్యబట్టారు. అమిత్ షా చేసిన ఈ వ్యాఖ్యల నేపథ్యంలోనే సీపీఐ నారాయణ పైవిధంగా స్పందించారు.

# నక్సల్స్‌తో చర్చలు జరపాలని కోరడం తప్పా?

- అమిత్ షాపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఫైర్




**హైదరాబాద్, మహా:** కాంగ్రెస్ పార్టీ గురించి కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నక్సల్స్‌ను ప్రోత్సహిస్తుందని కేంద్ర మంత్రి చెప్పడం విడ్డురంగా ఉందన్నారు. ఆపరేషన్ కగార్ విషయంలో నక్సల్స్‌తో చర్చలు జరపాలని కోరడం తప్పా అని ప్రశ్నించారు. దేశంపై దాడి చేసిన టెర్రరిస్టుల విషయంలో బీజేపీ ఎలాంటి ధోరణి వ్యవహరించిందో అంతా చూశారన్నారు. 'ట్రంప్ ఆదేశిస్తే.. టెర్రరిస్టుల విషయంలో వెనకడుగు వేసిన మీరా మమ్మల్ని విమర్శలు చేసేది' అంటూ ఫైర్ అయ్యారు. శాంతి భద్రతలు, దేశ రక్షణ విషయంలో కాంగ్రెస్ రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పాకిస్తాన్‌తో యుద్ధం చేసి ట్రంప్ చెప్తే మధ్యలో ఆపేశారని దుయ్యబట్టారు. దేశ పౌరులు లెఫ్ట్ ఉద్యమంలో ఉంటే వారితో సీజ్ ఫైర్ చేసి వారితో ఎందుకు చర్చలు జరపరని ప్రశ్నించారు. కేంద్రంలో ఫాసిస్ట్ మోడీ పాలనకు వ్యతిరేకంగా ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే తెలంగాణకు వస్తున్నారని తెలిపారు. జూలై 4నఎల్బీ స్టేడియంలో జరిగే గ్రామస్థాయి అధ్యక్షుల సభలో ఖర్గే పాల్గొంటారని తెలిపారు. గ్రామ శాఖ అధ్యక్షులు నుంచి మండల, జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అనుబంధ సంఘాలు రాష్ట్ర స్థాయి నేతల వరకు 25 వేల మంది ఈ సభలో పాల్గొంటారని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# అభివృద్ధి ప్రచారంలో సమాచార శాఖదే కీలక పాత్ర

## ప్రత్యేక కమిషనర్ సి.హెచ్ ప్రియాంక



**హైదరాబాద్, మహా :** ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో సమాచార పౌర సంబంధాల శాఖ కీలక పాత్ర పోషిస్తుందని ఐ అండ్ పీఆర్ ప్రత్యేక కమిషనర్ సి హెచ్ ప్రియాంక అన్నారు. సమాచార శాఖ ప్రధాన కార్యాలయంలో పౌర సంబంధాల అధికారి గా విధులు నిర్వర్తిస్తున్న ముళ్ళపూడి శ్రీనివాస్ కుమార్ సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా హైదరాబాద్ రాష్ట్ర సమాచార శాఖ కార్యాలయంలో PRO శ్రీనివాస్ కుమార్ ను కార్యాలయ అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక కమిషనర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలిచి ప్రభుత్వం చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని ప్రజలకు చేరవేసేందుకు సమాచార శాఖ అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. సమాచార శాఖ కార్యాలయంలో ముళ్ళపూడి శ్రీనివాస్ కుమార్ తమ విధులను అంకితభావంతో సమర్ధవంతంగా నిర్వర్తించారని I &PR ప్రత్యేక కమిషనర్ సి హెచ్ ప్రియాంక ప్రశంసించారు. ఉద్యోగ విరమణ మరొక కొత్త జీవితం అని అన్నారు. ఉద్యోగంలో ఉన్నప్పుడు వ్యక్తి గత జీవితాన్ని చాలా కోల్పోతామని, ఉద్యోగం విరమణ తర్వాత కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలన్నారు. అనంతరం శ్రీనివాస్ కుమార్ కుటుంబ సభ్యులను ప్రత్యేక కమిషనర్ పరిచయం చేసుకున్నారు. శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ తన 38 ఏండ్ల ఉద్యోగ జీవితం సంతృప్తిగా సాగిందన్నారు. అనేక పురస్కారాలు లభించాయన్నారు. చిత్తశుద్ధితో పని చేయడం వలన సమాచార శాఖ కు తాను చేసిన సేవల కంటే పొందినదే ఎక్కువ అని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ అదనపు సంచాలకులు డి.ఎస్.జగన్, సంయుక్త సంచాలకులు కె.వెంకట రమణ, వెంకటేశ్వరావు, ఉప సంచాలకులు మధుసూధన్, వై వెంకటేశ్వర్లు, ప్రసాద్, హష్మీ , సమాచార శాఖ అధికారులు ,పాల్గొన్నారు.

# బీజేపీ-బీఆర్ఎస్ మ్యాచ్ ఫిక్సింగ్

- అందులో భాగమే టీబీజేపీ కొత్త చీఫ్ ఎంపిక
- రూట్ మ్యాప్‌తో రానున్న రోజుల్లో రెండు పార్టీలు ముందుకు
- ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

**ఢిల్లీ, మహా:** తెలంగాణ బీజేపీ కొత్త అధ్యక్షుడి నియామకం బీజేపీబీఆర్ఎస్‌ల మ్యాచ్ ఫిక్సింగ్‌లో భాగమేనని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. బీజేపీబీఆర్ఎస్‌లు మ్యాచ్ ఫిక్సింగ్‌లో ఉన్నాయనే విషయం దీని ద్వారా నిరూపితమైందంటూ సెటైర్లు వేశారు. సోమవారం ఢిల్లీ నుంచి మాట్లాడిన చామల.. కేసీఆర్ గెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారని, అటువంటప్పుడు దోచుకోవడానికి ఏముంటుందని ప్రశ్నించారు.

**కిషన్ రెడ్డి నోరు విప్పరు..**

'మీరు (కేంద్రం) ఏమైనా నిధులు ఇస్తే రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ఉపయోగిస్తుంది. బీజేపీ 8 ఎంపీ సీట్లు గెలుపుకోసం బీఆర్ఎస్ చేసింది అందరికీ తెలుసు. రానున్న రోజుల్లో కూడా ఆ రెండు పార్టీలు అదే రూట్ మ్యాచ్‌తో ముందుకు వెళ్లనున్నాయి. హైదరాబాద్‌లో మెట్రోకు పునాదులు వేసింది ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం. కిషన్‌రెడ్డి.. తెలంగాణ, హైదరాబాద్ సమస్యల విషయంలో నోరు విప్పరు. హైదరాబాద్ నగర ప్రజకు కిషన్‌రెడ్డి చేసిందేమిటి?, ఈ ఏడాది కేంద్రం నయా పైసా ఇవ్వలేదు. విభజన హామీలు నెరవేర్చలేదు. హైదరాబాద్ మెట్రో కోసం ఐదారుసార్లు సీఎం రేవంత్ ఢిల్లీకి వచ్చారు. మనం కట్టిన ట్యాక్సుల్లో మన వాటా వెనక్కి రావడం లేదు. సీఎం రేవంత్ తన ప్రయత్నం తాను చేస్తున్నారు.. కిషన్‌రెడ్డి కూడా రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచెయ్యాలి' అని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సూచించారు.



## బనకచర్లకు బ్రేక్.. ఏపీకీ కేంద్రం షాక్

# రేవంత్ సర్కార్ మరో విజయం

### బనకచర్లకు అనుమతులు ఇవ్వలేమని తేల్చేసిన కేంద్ర పర్యావరణ కమిటీ

ఫలించిన ముఖ్యమంత్రి రేవంత్, మంత్రి ఉత్తమ్ ఒత్తిడి

అఖిలపక్ష ఎంపీల భేటీతో పాటు కేంద్రమంత్రులను కలిసి వివరణ

జాతీయస్థాయిలో బనకచర్ల అన్యాయాన్ని ప్రస్తావించిన రేవంత్

బనకచర్ల నిర్మిస్తే భద్రాచలం, మణుగూరు, దుమ్ముగూడెం మునకే

**హైదరాబాద్, మహా : బనకచర్లను అడ్డుకుని తీరుతామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్రంపై వ్యూహాత్మక ఒత్తిడి ద్వారా తొలి విజయం సాధించారు. బనకచర్ల వ్యవహారంలో మొండిగా ముందుకెళ్ళిన ఏపీకి భారీ షాక్ తగలగా.. తెలంగాణకు ఊరట లభించింది. బనకచర్ల వ్యవహారంపై కేంద్ర జలశక్తితోపాటు పలు శాఖల మంత్రులకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సోదాహరణగా వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్రంపై తీసుకువచ్చిన ఒత్తిడి ఫలించింది. ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదించిన పోలవరం- బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వలేమని కేంద్రం ఏపీకి తేల్చి చెప్పింది. పోలవరం- బనకచర్లకు అనుమతులు ఇవ్వలేమని కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ స్పష్టం చేసింది. బనకచర్ల ప్రాజెక్టుపై అనేక అభ్యంతరాలు వచ్చాయని తెలిపింది. అనుమతులు ఇవ్వాలంటే జీడబ్ల్యూడీటీ అవార్డు పరిశీలించాల్సి ఉందన్న కేంద్ర కమిటీ వివరించింది. పర్యావరణ అనుమతులకు సీడబ్ల్యూసీని సంప్రదించడం తప్పనిసరని వెల్లడించింది**

ఈ ప్రాజెక్టు జీడబ్ల్యూడీటీ తీర్పు ఉల్లంఘించినట్లు అవుతుందని ఫిర్యాదులు వచ్చాయన్న కమిటీ వివరించింది. బనకచర్ల ప్రాజెక్టును ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేపట్టినట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన రిపోర్ట్‌ను నిపుణుల కమిటీ పరిశీలించింది. అయితే, 1983లో గోదావరి ట్రైబ్యునల్ ఇచ్చినటువంటి తీర్పునకు విరుద్ధంగా ఈ ప్రాజెక్టు నిర్మిస్తున్నారని అభిప్రాయపడింది. ఈ ప్రాజెక్టులో నీటి నిల్వపై కేంద్రంతో అధ్యయనం, రెండు రాష్ట్రాలకు (ఏపీ, తెలంగాణ) సంబంధించిన అంశాలకు అన్ని అనుమతులు, పర్యావరణ ప్రభావంపై అంచనా వేసిన తర్వాతే ప్రాజెక్టుకు పూర్తిస్థాయి అనుమతివ్వడానికి సాధ్యమవుతుందని ఎక్స్‌పర్ట్స్ కమిటీ తేల్చి చెప్పింది.

**జనవరి నుండే ప్రతిఘటన**

ఈ ఏడాది జనవరి నుండే బనకచర్లను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిఘటిస్తూ ఉంది. బనకచర్లను వ్యతిరేకిస్తూ 22012025 నుంచి జూన్ 1606 2025 వరకు కేంద్రానికి మొత్తం ఆరు సార్లు లేఖ రాయడమే కాకుండా ఏపీ ప్రభుత్వం పునర్విభజన చట్టాలు, ట్రిబ్యునల్ ఆదేశాలు ఎలా ఉల్లంఘించిందో కేంద్ర మంత్రులను పలుమార్లు కలిసి సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ వివరించారు. ఇటీవల అఖిలపక్ష సమావేశం నిర్వహించడంతో పాటు ఇటీవల ఢిల్లీకి వెళ్ళి తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న గోదావరి బనకచర్ల ప్రాజెక్టు ప్రీ ఫీజుబిలిటీ రిపోర్టును తిరస్కరించాలని కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టు విషయంలో గోదావరి జల వివాదాల ట్రైబ్యునల్ 1980 (జీడబ్ల్యూడీటీ), ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014కు విరుద్ధంగా ఏపీ సర్కారు వ్యవహరిస్తోందని తెలిపారు. బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతుల విషయంలో కేంద్ర ఆర్థిక, పర్యావరణ శాఖలు వ్యవహరిస్తున్న తీరుతో తెలంగాణ ప్రజలు, రైతుల్లో ఆందోళనలు నెలకొన్నాయని చెప్పారు. గోదావరి వరద జలాల ఆధారంగా బనకచర్ల ప్రాజెక్టును ప్రతిపాదిస్తున్నామని ఏపీ చెబుతోందని, కానీ, జీడబ్ల్యూడీటీ 1980లో వరద, మిగులు జలాల ప్రస్తావనే లేదని వివరించారు. పునర్విభజన చట్టం ప్రకారం ఏ రాష్ట్రంలోనైనా కొత్తగా ప్రాజెక్టును కట్టాలనుకుంటే తొలుత ఆ నదీ యాజమాన్య బోర్డు, సీడబ్ల్యూసీ, అపెక్స్ కౌన్సిల్‌లో చర్చించి అనుమతి పొందాలని, కానీ, ఏపీ వీటన్నింటినీ ఉల్లంఘిస్తోందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఏ నిబంధనలూ పాటించకుండా.. వరద జలాల ఆధారంగా ప్రాజెక్టు చేపడుతున్నామని చెప్పడం తీవ్ర అభ్యంతరకరమని తెలిపారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం, జల్‌శక్తి శాఖ తక్షణమే జోక్యం చేసుకొని బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపిని కూడా కలుపుకుని ఒత్తిడి తీసుకురావడం, ఏపీ ప్రభుత్వానికి కూడా గట్టి వ్యతిరేకత తెలియపరచడంతో చివరకు.. తెలంగాణ సర్కారు అనుకూలంగా తీర్పు తెచ్చుకోగలిగింది.

**గతంలో గల్లీ పోరాటమే తప్ప..**

గతంలో గల్లీ పోరాటమే తప్ప సరైన వ్యూహం లేకపోవడం వల్ల తెలంగాణకు మొండిచెయ్యే మిగిలింది. ఇపుడు ముఖ్యమంత్రి రేవంత్కేం ద్రంతో సత్సంబంధాలు కొనసాగిస్తూ రాష్ట్రానికి కావాల్సినవి సాధించుకోవడంలో రాజీపడడం లేదు. తెలంగాణ ఇటీవల కాలంలో అనేకం సాదించింది. ఇంకా సాదించాల్సినవి ఉన్నా.. ఒత్తిడి వ్యూహం, సరైన పద్దతిలో రిప్రజెంటేషన్ తో ఫలితాలు సాధిస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ పోరాట ఫలితమే ఇవాళ కేంద్ర నిపుణుల కమిటీ నిర్ణయం అని కాంగ్రెస్ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

### ప్రాజెక్టుతో ముప్పు

ఈ ప్రాజెక్టును నిర్మిస్తే తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు కలిగే నష్టంపై బలమైన వాదనలు వినిపించామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. బనకచర్ల పథకంతో తెలంగాణకు ఏర్పడనున్న ముప్పుపై సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి ఈ నెల 19న కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు వివరంగా పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చామని కొద్ది రోజుల క్రితం తెలిపారు. ఆ ప్రాజెక్టు ప్రీ ఫీజిబిలిటీ నివేదికను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించొద్దని, తిరస్కరించాలని తేల్చి చెప్పామన్నారు. దాంతో నివేదికను ఆమోదించలేదని, త్వరలోనే ఎపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని చెప్పారు. ప్రాజెక్టు నిర్మిస్తే భద్రాచలం పట్టణంతో పాటు మణుగూరు. దుమ్ముగూడెం ప్రాంతాలు ముంపుకు గురికానున్నాయి. ఈ అంశాలు రాష్ట్రం బలంగా ప్రస్తావించి అనుమతులు రాకుండా చేయగలిగింది.

### నేడు ప్రజాప్రతినిధులకు పీపీటీ


**కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లకు నేడు బనకచర్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వబోతున్నారు. ప్రజాభవన్‌లో నిర్వహించే ఈ సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రివర్గ బృందం మొత్తంగా హాజరుకానుంది. ప్రధానంగా ప్రాజెక్టుపై అందరికీ అవగాహన కల్పించాలనే లక్ష్యంతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు.**

# బీజేపీ చీఫ్‌గా రామచందర్ రావు

## అందరివాడనే ఆమోదం

### అఖరి నిమిషంలో బీజేపీ హైకమాండ్ ట్విస్ట్

### ఎన్ఆర్ఆర్ నియామకంపై సీనియర్ల హ్యాపీ.. పార్టీ శ్రేణుల హర్షం



**(మొదటిపేజీ తరువాయి)**

తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా ఎన్. రాంచందర్ రావు కిషన్ రెడ్డి స్థానంలో బాధ్యతలు చేపట్టనున్నారు. రాంచందర్ రావు ఆరెస్సెస్, ఏబీవీపీల్లో పనిచేయడంతోపాటు, పార్టీకి విధేయుడు, వివాదరహితుడనే ముద్ర ఉండటంతో అధిష్టానం ఆయన్ను ఎంపిక చేసింది. అందరినీ కలుపుకొని పోయే మనస్తత్వం ఉన్న రాంచందర్ రావు తెలంగాణలో పార్టీని బలోపేతం చేయడానికి ఎప్పటి నుంచో కృషి చేస్తున్నారు. ఆయనకు క్షేత్రస్థాయిలోనూ అందరితో బలమైన సంబంధాలు ఉండటం బీజేపీకి కలిసి రానుంది. కిషన్ రెడ్డి కంటే ముందు తెలంగాణ అధ్యక్షుడిగా బీసీ సామాజికవర్గానికి చెందిన బండి సంజయ్ వ్యవహరించారు. ఆయన నాయకత్వంలో పార్టీ తెలంగాణలో బాగా పుంజుకుంది. కానీ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముందు అనూహ్యంగా ఆయన స్థానంలో కిషన్ రెడ్డికి పగ్గాలు అప్పగించారు. రాష్ట్రంలో బీసీల జనాభా ఎక్కువ కావడంతో.. మరోసారి బీసీ నేతకే పార్టీ పగ్గాలు అప్పగిస్తారని చాలా మంది భావించారు. కానీ ఆరెస్సెస్ అండదండలు పుష్కలంగా ఉన్న రాంచందర్ రావును ఆ పదవి వరించింది. ఏపీలోనూ మొదటి నుంచి బీజేపీతోనే ఉన్న మాధవ్‌కు ఆ పార్టీ పగ్గాలు దక్కుతుండటం విశేషం. బీజేపీ అధినాయకత్వం ఓ వ్యూహం ప్రకారమే రాంచందర్ రావును తెలంగాణ పార్టీ సారథిగా నియమించినట్లు తెలుస్తోంది. రాంచందర్ రావు మొదటి నుంచి బీజేపీతోనే ఉన్నారు. విద్యార్థిగా ఉన్నప్పటి నుంచే ఆయన ఆరెస్సెస్, ఏబీవీపీల్లో పని చేశారు. బీజేవైఎం, లీగల్ సెల్‌ల నుంచి ఆయన నాయకుడిగా ఎదిగారు. న్యాయవాది అయిన రాంచందర్ రావు గతంలో హైదరాబాద్ బీజేపీ జిల్లా అధ్యక్షుడిగానూ పని చేశారు. గెలుపోటములకు అతీతంగా ఆయన పార్టీ పట్ల అంకితభావంతో పని చేశారు. బీజేపీ అధిష్టానానికి నమ్మకస్తుడు కావడంతోపాటు సౌమ్యుడైన ఆయనకు ఎవరితోనూ ఆయనకు విభేధాలు లేవు. క్షేత్ర స్థాయి కార్యకర్తల దగ్గర్నుంచి అత్యున్నత స్థాయి నేతల వరకు అందరితోనూ ఆయనకు మంచి పరిచయాలు ఉన్నాయి. తెలంగాణ రాజకీయాల పట్ల బీజేపీ గత కొంత కాలంగా ఆచితూచి వ్యవహరిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో దూకుడుగా వ్యవహరించే నేతల కంటే.. వివాద రహితుడు, అందరిని కలుపుకొని పోయే మనస్తత్వం ఉన్న రాంచందర్ రావును ఎంపిక చేయడమే బెటర్ అనే అభిప్రాయానికి కమల నాథులు వచ్చారు. అధినాయకత్వం ప్రాధాన్యాలను అర్థం చేసుకుంటూ, క్షేత్ర స్థాయిలో పార్టీ బలం పెంచేలా కృషి చేస్తూ.. తెలంగాణలో బీజేపీని మరింత బలోపేతం చేసే చాణక్యం, నేర్పు రాంచందర్ రావుకు ఉన్నాయని ఆయన్ను చాలా కాలంగా దగ్గర్నుంచి చూసినవారు చెబుతున్నారు.

## తెలంగాణ అంగన్‌వాడీలు దేశానికి రోల్‌మోడల్‌గా నిలవాలి

### సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, మహా:** తెలంగాణ అంగన్‌వాడీలు దేశానికి రోల్‌మోడల్‌గా నిలిచేలా తీర్చిదిద్దాలని.. ఇందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీలకు వచ్చే పిల్లలకు పౌష్టికాహారం అందించడంతో పాటు అయిదేళ్ల వరకు వారికి పూర్వ ప్రాథమిక విద్యను అందించి నేరుగా ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లేలా చూడాలని సూచించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సాధికారిత శాఖలపై మంత్రులు ధనసరి అనసూయ సీతక్క, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో పాటు ఉన్నతాధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు.

- "అంగన్‌వాడీలకు నూతన భవనాలు నిర్మించే విషయంలో అధునాతన సాంకేతికతను వినియోగించుకోవాలి. పిల్లల అవసరాలకు తగినట్లు కంటైనర్లతో డిజైన్ చేయించే అంశాన్ని అధ్యయనం చేయాలి.
- సోలార్ ప్లేట్లు, బ్యాటరీ బ్యాకప్‌తో కంటైనర్ అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేస్తే తక్కువ వ్యయం, ఎక్కువ సౌకర్యం ఉంటుంది. ఈ అంశంపై ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో ఉన్న కంటైనర్ కేంద్రాలను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలి. అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రతి పిల్లవానికి పౌష్టికాహారం అందించాలి. ఇందుకు ఎన్జీవోల సేవలు వినియోగించుకోవాలి.
- బాలామృతం ప్లస్‌ను పెద్ద మొత్తంలో ఇచ్చేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలి. కర్ణాటకలో జొన్న రొట్టెలను వినియోగిస్తున్నందున పౌష్టికాహార నిపుణులతో చర్చించి వాటిని మహిళా సంఘాలతో పిల్లలకు అందించే అంశంపైనా దృష్టి సారించాలి. అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం అందజేత, అంగన్‌వాడీల పర్యవేక్షణ, నిర్వహణపై వంద రోజుల కార్యాచరణ రూపొందించి అమలు చేయాలి.
- గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంక్షేమం విషయంలో అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు కలిసే పని చేయాలి. అనాథ పిల్లలకు పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశం కల్పిస్తున్నట్టే, ఏటీసీల్లోనూ వాళ్లకు ప్రవేశాలు కల్పించాలి. మన పిల్లలను సింగపూర్‌లోని నైపుణ్య శిక్షణ కేంద్రాలకు పంపే ఒప్పందం చేసుకున్నాం. అక్కడకు పంపే వారిలో అనాథ పిల్లలకు చోటు కల్పించాలి.
- ఔటర్ రింగు రోడ్డు పరిధిలోని బస్తీలు, వలస కార్మికులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోని పిల్లల కోసం మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. నిర్దేశిత సమయంలో అక్కడి పిల్లలకు ఆయా వాహనాల ద్వారా పౌష్టికాహారం అందేలా చూడాలి. విశ్రాంత ఉద్యోగులు, ఐటీ ఉద్యోగులు ఆయా పిల్లలకు బోధన చేసేందుకు ఆసక్తి చూపితే అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలి. తెలంగాణ ఫుడ్స్, విజయా డెయిరీ ఉత్పత్తులను అంగన్‌వాడీలకు అందేలా చూడాలి" అని చెప్పారు.
- నిర్లక్ష్యానికి గురవుతున్న తల్లిదండ్రులను లేదా కుటుంబ సభ్యులు పట్టించుకోలేని స్థితిలో ఉన్న వృద్ధులకు ప్రభుత్వం అండగా నిలవాల్సి ఉందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు అభిప్రాయపడ్డారు. ఉద్యోగులైతే వారి వేతనాల నుంచి నేరుగా వారి తల్లిదండ్రులకు ఖాతాలకు 1015 శాతం జమ అయ్యే అంశాన్ని పరిశీలించాలని, ఈ అంశంలో సమగ్రమైన నివేదిక సమర్పించాలని అధికారులకు సీఎం గారు సూచించారు.
- ట్రాన్స్‌జెండర్లకు ప్రస్తుతం ట్రాఫిక్ విభాగంలో అవకాశం కల్పించామని, వారి సేవలను రవాణా, దేవాదాయ శాఖ, వైద్యారోగ్య శాఖలతో పాటు ఐటీ, ఇతర కంపెనీల సేవల్లో వినియోగించుకునేలా చూడాలని సీఎం గారు ఆదేశించారు.
- తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్‌లో చిన్నారులు, మహిళలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలపై విధివిధానాలు రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.
- ముఖ్యంగా దివ్యాంగుల మధ్య వివాహాలు, వివిధ పథకాల్లో దివ్యాంగులకు ప్రోత్సాహకాలు కల్పించే విషయంపై అధ్యయం చేసి వచ్చే మంత్రిమండలి సమావేశం నాటికి నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు.

## బీజేపీకి ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామా

### హైకమాండ్ సీరియస్.. ఆమోదించే యోచన



**హైదరాబాద, మహా :** తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్ష పదవికి నామినేషన్ల ప్రక్రియ జరుగుతున్న వేళ ఆ పార్టీలో కీలక పరిణామం చోటు చేసుకుంది. బీజేపీకి గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ రాజీనామా చేశారు. రాజీనామా లేఖను రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డికి సోమవారం అందజేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో మీడియాతో ఎమ్మెల్యే రాజా సింగ్ మాట్లాడుతూ.. రాష్ట్ర అధ్యక్ష పదవికి నామినేషన్ వేసేందుకు వెళ్లితే.. తనను అడ్డుకున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ క్రమంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎమ్మెల్యే రాజా సింగ్ వివరించారు. ఇక తాను బీజేపీలో కొనసాగలేనని ఆయన స్పష్టం చేశారు. తనకు మద్దతు ఇస్తే.. పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామంటూ తన అనుచరులను కొందరు బెదిరించారని ఆరోపించారు. బీజేపీ అధ్యక్ష పదవికి పోటీ చేసేందుకు తాను ముహూర్తం సైతం చూసుకున్నానని తెలిపారు. బీజేపీ అధికారంలోకి రాకూడదని పార్టీలోని కొందరు పెద్ద నాయకులు అనుకుంటున్నారని పేర్కొన్నారు. మీకో దండం.. మీ పార్టీకో దండమంటూ ఎమ్మెల్యే రాజా సింగ్ స్పష్టం చేశారు..

## సార్క్ కు పోటీగా చైనా-పాక్ కొత్త కూటమి?



**(మొదటిపేజీ తరువాయి)**

దక్షిణాసియా దేశాల ఐకమత్యాన్ని పెంపొందించేందుకు కొత్త ప్రాంతీయ కూటమి అవసరమనే బలమైన భావనతో పాక్, చైనాలు ఉన్నాయని పేర్కొంది. 1985 డిసెంబరు 8న ఏర్పాటైన సార్క్ కూటమిలో వ్యవస్థాపక దేశాలుగా భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, భూటాన్, మాల్దీవ్స్, నేపాల్, శ్రీలంక ఉన్నాయి. 2007లో ఇందులో అఫ్గానిస్థాన్ చేరింది. సార్క్‌కు ప్రత్యామ్నాయంగా నిలిచేలా కొత్త ప్రాంతీయ కూటమికి రూపకల్పన చేయాలని చైనా, పాక్ భావిస్తున్నట్లు సమాచారం. ఇటీవలే ఈ చర్చల్లో బంగ్లాదేశ్ కూడా భాగమైనట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే భారత్ కు ఇబ్బందికర పరిణామమే. సార్క్‌లో 10 పరిశీలక దేశాలు ఉన్నాయి. అవి ఆస్ట్రేలియా, చైనా, యూరోపియన్ యూనియన్, ఇరాన్, జపాన్, మారిషస్, మయన్మార్, దక్షిణ కొరియా, అమెరికా. చివరిసారిగా 2014లో సార్క్ సదస్సు జరిగింది. వివిధ కారణాలతో గత పదేళ్లుగా ఈ కూటమి సమావేశం కాలేకపోతోంది. దీనికితోడు ఇప్పుడు ప్రపంచంలో మరో కోల్డ్ వార్ మొదలైంది. ఈ నేపథ్యంలో అలర్ట్ అయిన చైనా కొత్త వ్యూహానికి పదును పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది.

Z కేటగిరీ

# కర్మఫలం ఒదిలించుకోతరం కానిది !!



*కర్ణుడి రథచక్రం భూమిలో ఇరుక్కుపోవడంతో రథం దిగి దాన్ని సరిచేయడం ప్రారంభించాడు.ఆ సమయంలో అతడు ఆయుధాలు లేకుండా ఉన్నాడు శ్రీకృష్ణుడు వెంటనే కర్ణుని బాణంతో చంపమని అర్జునుని ఆదేశించాడు.అర్జునుడు కర్ణుని లక్ష్యంగా చేసుకుని ఒకదాని తర్వాత ఒకటి బాణాలు ప్రయోగించాడు.కర్ణుడు నేలపై పడిపోయాడు. మరణానికి ముందు నేలమీద పడిన కర్ణుడు శ్రీకృష్ణుడిని ఇలా అడిగాడు,ఇది నీ న్యాయమైన నిర్ణయమేనా! నిరాయుధుడిని చంపమని ఆజ్ఞ ఇచ్చావా! అని. "అర్జునుని కొడుకు అభిమన్యుడు కూడా పద్మవ్యూహంలో నిరాయుధునిగా ఉన్నప్పుడే అందరూ కలిసి నిర్దాక్షిణ్యంగా అతన్ని చంపేశారు.అందులో నువ్వు కూడా ఉన్నావు. అప్పుడు నీ జ్ఞానం ఎక్కడ ఉంది.అప్పుడు అభిమన్యుడు నిరాయుధుడుగా ఉన్నాడని ఇది అధర్మం అని అనిపించలేదా.ఇది కర్మ ప్రతిఫలం" అన్నాడు కృష్ణుడు.*

ఆలోచనాత్మకంగా పని చేయండి.ఒకరి బలహీనతను ఉపయోగించుకోకండి. అదే కర్మ భవిష్యత్తులో మీ కోసం వేచి ఉంటుంది.అది మీకు దాని ప్రతిఫలాన్ని ఇస్తుంది .ఏ విత్తు నాటితే ఆ మొక్క మొలుస్తుంది.గోడకు కొట్టిన బంతి తిరిగి వచ్చినట్టు.రామాయణ,భారతం మొదలగు ఇతిహాసాలు,చరిత్ర,కథలు,పురాణాలు చూసినా అదే బోధ పడుతుంది.కేసీఆర్ కు ఇతిహాసాలు,కథలు,పురాణాలన్నంటినీ ఎప్పుడో నమిలి మింగేశారు. కర్మ ఫలం ఒదిలించుకోవడానికి గాను తాను కూడా మినహాయింపు కాదన్న జ్ఞానోదయం అయిందో లేదో తెలియదు.అధికారం కోల్పోవడం ఒక పరాభవమైతే,విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు,ఫోన్ ట్యాపింగ్,కాళేశ్వరం వంటి కేసులు చుట్టుముట్టడం కలలోనూ ఊహించని పరిణామం.సాధారణంగా గెలుపు ఎవరికీ శాశ్వతం కాదని అంటుంటాం.కానీ ఓటమి అనంతరం 'ఓటమి శాశ్వతం కాదు' అని బిఆర్ఎస్ పార్టీ నాయకత్వం కొత్త థియరీని కనిపెట్టి సమాజం మీదకు వదిలింది.

2014 నుంచి కేసీఆర్ నడిపిన ఫిరాయింపు క్రీడలో 'కొనుగోలు' వ్యవహారం లేదని నమ్మడానికి జనం సిద్ధంగా లేరు.ఫోన్ ట్యాపింగ్ వంటి చట్టవ్యతిరేక చర్యలకు ప్రత్యేకంగా ఒక 'ముఠా' ఏర్పాటు చేసిన వాళ్ళు ఎవరయినా సరే బోనెక్కవలసిందే! చట్టానికి ఎవరూ అతీతులు కాదని చెప్పవలసిన అవసరం లేదు.ఫోన్ ట్యాపింగ్ కథ స్క్రీన్ ప్లే దర్శకత్వం ఎవరు నడిపారో ,ఎవరు పర్యవేక్షించారో తెలంగాణ పౌరసమాజానికి తెలిసిపోయింది.అటువంటి అనైతిక చర్యలతో మరలా అధికారంలోకి రావాలనుకున్న పద్ధతే ప్రజలకు నచ్చనిది.ఓ వైపు ప్రజలంతా తమ వైపే ఉన్నారంటూ ఊరూ వాడా ప్రచారం చేసిన నాయకులు,ఏ అనుమానంతో ట్యాపింగ్ కు అనుమతించినట్టు భావించాలి?ప్రజలపై నమ్మకం లేకనే కదా! ఓటుకు ఆరు వేల నుంచి పది వేలరూపాయల చొప్పున పంచినా తమను ఎందుకు తిరస్కరించారో ఏనాడయినా సమీక్షించుకున్నారా? లేదు.బిఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు 2021 22 ప్రాంతాల్లో 'అమ్ముడుబోవడానికి' సిద్ధంగా ఉన్నట్టు సంకేతాలు ఇస్తేనే బీజేపీ నాయకత్వం బేరసారాలకు దిగిందని ప్రపంచానికి తెలుసు.ఇలాంటి 'ఆణిముత్యాల'పై ఫోన్ ట్యాపింగ్ రూపంలో నిఘా పెట్టడం వల్లనే మొత్తం బాగోతం బయటపడినట్టు అప్పట్లో కథనాలు వచ్చాయి.ఇదే ఫోన్ ట్యాపింగ్ ట్రిక్కుతో ఓటుకు నోటు కేసులో చంద్రబాబును,రేవంత్ రెడ్డిలను ఇరికించలేదా?

గూఢచారి వ్యవస్థను పూర్తిగా 'పాప పంకిలం'గా మార్చిపారేశారు. దేశంలో మరెక్కడా ఏ రాజకీయ పార్టీ చేయని గొప్ప పని చేసినట్టుగానూ నాటి ప్రభుత్వంలోని ముఖ్యులు భావిస్తూ ఉండవచ్చు.పైగా ఒక సామాజికవర్గానికి అన్ని ప్రభుత్వ శాఖల్లో,పదవుల్లో,పోలీసుల్లో కీలక బాధ్యతలు అప్పగించిన చరిత్ర దేశంలో మరెక్కడా లేదు.ఉత్తరప్రదేశ్,బిహార్,జార్ఖండ్ వంటి రాష్ట్రాల్లోనూ 'ఒక కులం ఒకే పార్టీ'అనే పథకాన్ని అమలు చేసిన వారెవరూ లేరు.ప్రజాస్వామ్యంలో అది సాధ్యమూ కాదు.తెలంగాణలోనే సాధ్యం కావడం వెనుక 'తెలంగాణ ఉద్యమ' కవచం కేసీఆర్ ధరించి ఉండడమే.ఆయన ఏమి చేసినా,లోక కళ్యాణం కోసమేనని నమ్మిన వాళ్ళు,నమ్ముతున్న వాళ్ళు,ఆ దిశగానే ప్రచారం చేస్తున్న వాళ్ళు కోకొల్లలుగా ఉండడం తెలంగాణ చారిత్రక విషాదం.

''కేసీఆర్ జీవితం ఒక చరిత్రగా నిలిచిపోతుంది.గత ప్రభుత్వాలు 60 ఏళ్లలో చేయలేని అనేక కార్యక్రమాలను కేసీఆర్ విజయవంతంగా సాధించారు.ప్రజాస్వామ్య పోరాటంతో,తెలంగాణ ఆర్తితో తెలంగాణ కోసం,కేవలం తెలంగాణ కోసమే కేసీఆర్ పనిచేశారు. ఉద్యమం ద్వారా కోట్లాది మందికి స్వరాష్ట్ర ఆశయాన్ని అందించారు.ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించి తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రాష్ట్రం కరువుకు,దాహానికి శాశ్వత పరిష్కారం చూపించారు.కేసీఆర్ బలం,జీవన దృక్కోణాన్ని అర్థం చేసుకోవడానికి జోకర్ కాంగ్రెస్ నాయకులకు జీవితకాలం కూడా చాలదు.అల్ప మనస్తత్వం ఉన్న కాంగ్రెస్ నాయకులు 100 జన్మలు ఎత్తినా కేసీఆర్ సాధించిన విజయాల్లో పదవ వంతయినా సాధించలేరు'' అని కేటీఆర్ జూన్ 11న కామెంటు చేశారు.అయితే కాళేశ్వరంలో కీలకమయిన మేడిగడ్డ బ్యారేజీకి బాంబులు పెట్టి పేల్చినది ఎవరు? కాంగ్రెస్ పార్టీ నాయకులే ఆ పనిచేశారని అనుకుందాం.మరి బ్యారేజీ కుంగుబాటుకు గురయిన తర్వాత రెండు నెలలకు పైగా బిఆర్ఎస్ పార్టీయే అధికారంలో ఉన్నది.కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నారు.దానిపై దర్యాప్తు ఎందుకు చేయనట్టు?నిందితులను ఎందుకు పట్టుకోలేదు?

కాగా ''కాంగ్రెస్ ప్రభుత్వం బీజేపీతో కలసి ప్రజల సమస్యల్ని పక్కదారి పట్టించడానికే పోన్ ట్యాపింగ్ అంశం తెరపైకి తీసుకువచ్చారు.
దీనివల్ల జాతీయ భద్రత కు ముప్పు వస్తుంది.దేశ భద్రత అంటే సీఎంకు తెలుసా?పోన్ ట్యాపింగ్ అనేది పోలీస్ వ్యవస్థలో భాగం.ఇంటలిజెన్స్,పోన్ ట్యాపింగ్ లపై ఆధారపడి రాజకీయం చేసి గెలిచే అవసరం బిఆర్ఎస్ కు లేదు.ప్రభాకరరావు 16 ఏళ్లు ఇంటలిజెన్స్ డిపార్ట్మెంట్ లో పని చేశారు.2019 లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా నుంచి ఉత్తమ సత్కారం పొందారు.''అని బిఆర్ఎస్ నాయకుడు,మాజీ ఐపీఎస్ అధికారి ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ జూన్ 29 న అన్నారు.ఆయన బహుజన సమాజ్ పార్టీ నాయకునిగా ఉన్నప్పుడు '' నియమనిబంధనలకు తూట్లు పొడిచి,తన బంధువు అయిన ప్రణీత్ రావుకు కేసీఆర్ డిఎస్పీగా ప్రమోట్ చేశారు.ఇంటెలిజెన్స్ వ్యవస్థను కేసీఆర్ విధ్వంసం చేశారు.రేవంత్ రెడ్డి,బండి సంజయ్ తదితర నాయకులతో పాటు నా ఫోన్లు కూడా ట్యాప్ చేశారు''అని ఆరోపించారు.బిఆర్ఎస్ లో చేరిన అనంతరం ప్రవీణ్ కుమార్ యూ టర్న్ తీసుకున్నారు.ప్రభాకరరావును నిర్దోషి అని సర్టిఫికెట్ ఇచ్చేశారు.కేసీఆర్ గొప్ప నాయకుడని ప్రశంసలు గుప్పిస్తున్నారు.ఫోన్ ట్యాపింగ్ అంశం జాతీయ భద్రతకు ముప్పు అని ఈ మాజీ ఐపీఎస్ అధికారి నిర్ధారిస్తున్నారంటే కేసీఆర్ హయాంలో జాతీయభద్రతకు ముప్పు కలిగించే కార్యక్రమాలు జరిగినట్టు అంచనా వేయవచ్చు.

''కేసీఆర్,కేటీఆర్ ఇంకా అధికారంలో ఉన్నట్లే ప్రవర్తిస్తున్నారు.ఇది పార్టీకి నష్టం కలిగిస్తోంది.హైదరాబాద్ లో మీడియా సమావేశాలు నిర్వహించడమే పార్టీ కార్యక్రమంగా మారింది.పార్టీ నిర్మాణంపై ఎలాంటి ఆసక్తి మా పార్టీ నాయకత్వానికి లేదు.పార్టీ సభ్యత్వ నమోదు గురించి ఏప్రిల్ ప్రాంతంలో గొప్ప ప్రకటనలు చేశారు.కానీ అలాంటి పని ఇంకా మొదలు కాలేదు.అమెరికా,లండన్,ఇతర దేశాల్లో బిఆర్ఎస్ రజతోత్సవ సభల వల్ల ఎలాంటి ప్రయోజనం లేదు. మాది అంతర్జాతీయ పార్టీయ కాదు.ఇక్కడ క్షేత్రస్థాయిలో పార్టీ బలహీనపడుతోంది.నేనొక పదిహేను సంవత్సరాల నుంచి పార్టీలో పని చేస్తున్నాను.మా పార్టీని కార్యకర్తలే ఓడించారు.ఆ విషయం కేటీఆర్ కు తెలుసు.కానీ ఓడిపోయినా తర్వాత కూడా కార్యకర్తలను ఆయన పట్టించుకునే పరిస్థితిలో లేరు.ఆయనకు విదేశీ పర్యటనల పట్ల ఉన్న ఆసక్తి,కార్యకర్తలతో సమీక్ష సమావేశాలు నిర్వహించే విషయంలో లేదు. రేవంత్ రెడ్డిపై సానుకూలత జనంలో ఏర్పడుతోంది. నా లాంటి వాళ్ళం వేరే దారి చూసుకోవాలన్న ఆలోచనలో ఉన్నాం.ఒకవేళ కవిత సొంత పార్టీ పెడితే మేమంతా అటువైపు వెళ్లేందుకు వెనుకాడం.కేసీఆర్, కేటీఆర్ కంటే ఆమె మాత్రమే క్రియాశీలంగా పనిచేస్తున్నారు.కాంగ్రెస్ లేదా బిజెపిలో చేరడం కన్నా కవిత జాగృతిలో చేరడమే మంచిదని అనుకుంటున్నాం'' అని ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన బిఆర్ఎస్ కార్యకర్త ఫోన్ లో నాకు చెప్పారు.

''తెలంగాణలో కాంగ్రెస్,బీఆర్ఎస్ మధ్య డీల్ కుదిరింద''ని బిజెపి మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్.ప్రభాకర్ మే 14 న సంచలన వ్యాఖ్యలు చేశారు.''రేవంత్ రెడ్డి స్థానంలో కేసీఆర్ సీఎం అవుతారు.కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనం కాబోతున్నది.డిసెంబర్ 9 తర్వాత విలీనం పక్కా. కేటీఆర్ నాయకత్వంలో పనిచేస్తారన్న మాజీ మంత్రి హరీష్ వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం'' అని ఆయన అన్నారు.తెలంగాణ రాజకీయాల్లో ఈ అంశం హాట్‌టాపిక్‌గా మారింది.బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒకటే అంటూ చాలా సార్లు బీజేపీ ఆరోపణలు చేసింది.బీజేపీకి కాంగ్రెస్‌కు మధ్య అంతర్గత ఒప్పందం ఉందంటూ బీఆర్ఎస్ పార్టీ కూడా ఆరోపణలు గుప్పించిన విషయం తెలిసిందే. అయితే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు దీనికి కొంత బలాన్ని చేకూర్చినట్లైంది.ఓ వైపు బీజేపీలో బిఆర్ఎస్ విలీనానికి కుట్ర జరుగుతోందని ఎమ్మెల్సీ కవిత ఆరోపించగా బీజేపీ నాయకుడు ప్రభాకర్ వ్యాఖ్యలు ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉన్నవి.మొత్తమ్మీద బిఆర్ఎస్ కదలికలు అనుమానాస్పదంగానే ఉన్నవి.ఒంటరిగా పోటీ చేసి రేవంత్ ను ఓడించలేకపోవచ్చునని,బిజెపితో నేరుగా కాకపోయినా లోపాయికారి ఒప్పందం చేసుకునే దిశగా అడుగులు పడుతున్నట్టు ఢిల్లీలో ఒక ప్రచారం ఉన్నది.బీజేపీ ప్రభాకర్ వ్యాఖ్యలు హాస్యాస్పదమని ఢిల్లీలోని రాజకీయ విశేషకులు అంటున్నారు.కాంగ్రెస్ పార్టీతో ఏ విధంగానూ కేసీఆర్ జట్టు కట్టే చాన్సు లేదని వారంటున్నారు.

> 2014 నుంచి కేసీఆర్ నడిపిన ఫిరాయింపు క్రీడలో 'కొనుగోలు' వ్యవహారం లేదని నమ్మడానికి జనం సిద్ధంగా లేరు. ఫోన్ ట్యాపింగ్ వంటి చట్టవ్యతిరేక చర్యలకు ప్రత్యేకంగా ఒక 'ముఠా' ఏర్పాటు చేసిన వాళ్ళు ఎవరయినా సరే బోనెక్కవలసిందే! చట్టానికి ఎవరూ అతీతులు కాదని చెప్పవలసిన అవసరం లేదు. ఫోన్ ట్యాపింగ్ కథ - స్క్రీన్ ప్లే - దర్శకత్వం ఎవరు నడిపారో,ఎవరు పర్యవేక్షించారో తెలంగాణ పౌరసమాజానికి తెలిసిపోయింది. అటువంటి అనైతిక చర్యలతో మరలా అధికారంలోకి రావాలనుకున్న పద్ధతే ప్రజలకు నచ్చనిది ఓ వైపు ప్రజలంతా తమ వైపే ఉన్నారంటూ ఊరూ వాడా ప్రచారం చేసిన నాయకులు,ఏ అనుమానంతో ట్యాపింగ్ కు అనుమతించినట్టు భావించాలి? ప్రజలపై నమ్మకం లేకనే కదా!

2014 నుంచి కాంగ్రెస్,టిడిపి తదితర పార్టీలను తుడిచిపెట్టేందుకు కేసీఆర్ గట్టిగా ప్రయత్నించారు.బీజేపీ నుంచి భయం లేదని ఒక దశలో ఊహించారు.తీరా బండి సంజయ్ సారధ్యంలో ఆ పార్టీ పుంజుకోవడంతో బిఆర్ఎస్ అధినేత కలవర పడ్డారు.బండి సంజయ్ స్థానంలో కిషన్ రెడ్డి పార్టీ తెలంగాణ అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కేసీఆర్ ఊపిరిపీల్చుకున్నట్టు అప్పట్లో కథనాలు వచ్చాయి.కానీ రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్షుడవుతారని,ఆయన సునామీలా చుట్టుముడతారని,తన పీఠం కిందకు నీళ్లొస్తాయని కేసీఆర్ ఊహించి ఉండకపోవచ్చు.గతంలో కాంగ్రెస్ ను దెబ్బతీసే లక్ష్యంతో కొంతకాలం బిజెపి పుంజుకోవడానికి పరోక్షంగా సహకరించినట్టు ఆరోపణలున్నవి.బిజెపిని ఓవర్ టేక్ చేసి కాంగ్రెస్ పార్టీ అనూహ్యంగా బిఆర్ఎస్ ను చావు దెబ్బ కొట్టడం సంచలన సన్నివేశం.

2018 లో ముందస్తు ఎన్నికల్లో 88 సీట్లతో భారీ మెజారిటీని ప్రజలు ఇచ్చినా,మిగతా రాజకీయ పార్టీలను 'నిర్మూలించాలన్న'కోరికే అసమంజసమైన చర్య.2014 నుంచే పెద్ద ఎత్తున పార్టీ ఫిరాయింపులు ప్రోత్సహించడం చారిత్రిక తప్పిదం.బిఆర్ఎస్ మినహా మరో రాజకీయ పక్షమే తెలంగాణ మైదానంలో ఉండరాదని అనుకోవడం కన్నా అనాలోచిత విధానం ఇంకేముంటుంది?పదేండ్లలో దాదాపు 65 మంది విధ పార్టీల నుంచి ఎమ్మెల్యేలు,నాయకులను విచ్చలవిడిగా చేర్చుకోవడం 'కర్మ' కిందకు వస్తుంది.ఇంకా చెప్పాలంటే 'ఇక మాది ఫక్తు రాజకీయ పార్టీ' అనే ప్రకటన చేసినప్పుడే వికృత రాజకీయ క్రీడకు శ్రీకారం చుట్టినట్లయ్యింది.కాంగ్రెస్,బిజెపిలలో కేసీఆర్ పై 'ప్రతీకార జ్వాల'ను రగిలించినట్లయ్యింది.పలు కారణాల వల్ల బీజేపీకి తెలంగాణకు సమర్థ నాయకత్వం కొరవడడం ఆ పార్టీకి శాపమే.రేవంత్ రెడ్డి లేదా హరీశ్ రావు వంటి జనాకర్షణ ప్లస్ మిలిటెన్సీ స్వభావం గల నాయకుల కోసం ఎంత గాలించినా బిజెపికి దొరకడం లేదు.సమర్థ నాయకత్వ లేమి మూలంగా పార్టీ అనుకున్నంత మేరకు పుంజుకోలేకపోతోంది. పైగా హైదరాబాద్,రంగారెడ్డి జిల్లాలకు చెందిన కొందరు సీనియర్లు పార్టీ తనకు తాను సొంతంగా ఎదగకుండా అడ్డుకుంటున్నట్టు స్వయంగా ఆ పార్టీ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆరోపించారు.ఆయా సీనియర్ల బృందానికి కేసీఆర్ తో సత్సంబంధాలున్నట్టు కూడా ఆయన వ్యాఖ్యానించారు.

బిజెపి నాయకత్వం బలహీనంగా ఉండడం,పలు కేసులు,కుంభకోణాలతో ఉక్కిరిబిక్కిరి అవుతూ బిఆర్ఎస్ 'చిక్కి శల్యమయి'పోతుండడం తమకు సానుకూల అంశంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. మూడేండ్ల తర్వాత జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ముక్కోణపు పోటీ ఉంటుందని తేలిపోయినందున ఆ రెండు పార్టీలను దెబ్బకొట్టేందుకు గాను ఇప్పటి నుంచే 'బ్లూ ప్రింట్' తయారు చేసుకునే ప్రయత్నాల్లో సీఎం ఉన్నట్టు కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి.

తమ పార్టీ పతనానికి కారణాలు తెలుసుకొని అవి పునరావృతం కాకుండా చూసుకోవాలన్న ఆలోచనలేవీ బిఆర్ఎస్ నాయకత్వంలో కానరావడం లేదు.రైతుభంధు పేరిట జరిగిన భయంకరమైన అధికారిక అవినీతీ,దోపిడి,దొంగతనం రేవంత్ రెడ్డికి ఆయుధంగా దొరికింది. అసలు వ్యవసాయం చేయని, బురదలోకి దిగని,ఆ భూమి ఎక్కడుందో కూడా తెలియని,వందలాది ఎకరాలన్న భూస్వాములు,రియల్టర్లు,ఎన్.ఆర్.ఐలు,గెజిటెడ్ ఆఫీసర్లు,ఉద్యోగులు,లక్షకుపైగా జీతగాళ్ళు,బిఆర్ఎస్ బినామీలుగా రైతుబంధు కొల్లగొట్టారు.సినిమా వాళ్లు,వ్యాపారులు,ఎమ్మెల్యేలు,ఎంపీలు,మంత్రులు,ఎంత ఎక్కువ భూమి ఉంటే అంత ఎక్కువ డబ్బులు కొట్టేశారు.

ప్రపంచంలో ఎక్కడ లేని విచిత్రమైన స్కీం.ధనవంతుడికి ధనమియ్యడమే కెసిఆర్ పాలసీ అని విమర్శలను ఎదుర్కొన్నారు.

దళిత బంధు పథకం కింద ఒకకుటుంభానికి 10లక్షలు ఇచ్చే కార్యక్రమం ఆచరణలో అసాధ్యమని కేసీఆర్ కు కూడా తెలుసు హుజురాబాద్ ఎన్నిక కోసం దాన్ని బయటకు తీశారు.ఈ పథకంలో ఇచ్చిన సొమ్మును ఎమ్మెల్యేలే కాజేశారంటూ సాక్షాత్ కెసిఆరే చెప్పారు. ప్రతిదళితు కుటుంబానికి 10 లక్షల ఇస్తానని చెప్పి, 100 కుటుంబాల్లో ఒక కుటుంబానికి ఇవ్వడం, మిగతావారికి ఇవ్వకపోవడం వారిని కోపానికి గురిచేసింది.ఈ 10 లక్షల్లో కూడా ఎమ్మెల్యేకు రెండు లక్షలు, అధికారులకు 1లక్ష లంచాల వలన ఇదొక స్కామ్ గా మిగిలిపోయింది.బీసీలకు కూడా కుటుంబానికి 5 లక్షలు ఇస్తామని చెప్పి అప్లికేషన్ ఫీజు కింద తల ఒక్కరికి 300 రూపాయలు వసూలు చేసి చివరికి ఎవరికి పైసా ఇవ్వలేదు.దీంతో ఆయా వర్గాలు కోపంతో రగిలిపోయాయి.తన సామాజికవర్గానికి చెందిన వారికి మేలు చేయడానికి కేసీఆర్ ధరణి తీసుకువచ్చినట్టు విమర్శలున్నవి.డబుల్ బెడ్ రూమ్ లలో ఒక ఊళ్లో పదిమందికి కూడా కేటాయించలేదు.కట్టివున్నా ఎవరికి ఇవ్వలేదు.సొంతంగా ఇంటి స్థలం ఉన్న వారికి,ఇల్లు కట్టుకోవడానికి ఆర్థిక సహాయం అని తెచ్చిన ఈ స్కీమ్,స్థలం ఉండి ఇల్లు కట్టుకుంటాం అంటే నయా పైస ఇవ్వ లేదు.ఆరోగ్యశ్రీని ఉద్దేశపూర్వకంగానే కేసీఆర్ మూలన పడేశారు.
యశోద లాంటి 5 స్టార్ హాస్పిటల్ లో తాను వైద్యం చేయించుకుంటూ, తన మంత్రివర్గ సహచరులను, ఎమ్మెల్యేలను, వైద్యం చేయించుకునేలా ప్రోత్సహించారు.దీంతో ఎంతో వైభవం,చరిత్ర వుండి,ఎంతోమంది ముఖ్యమంత్రులు,మంత్రులు,ప్రముఖులు వైద్యం చేయించుకున్న ఉస్మానియా హాస్పిటల్ మరుగునపడిపోయింది.

ప్రభుత్వ పాఠశాలలను, ప్రభుత్వ హాస్పిటల్స్ ను నాశనం చేసి కార్పొరేట్లకు కొమ్ముకాశారు.హైదరాబాదులో సామాన్యులకు,మధ్య తరగతి ప్రజలకు ఇల్లు,ఇంటి స్థలం ఊహకయినా అందకుండా చేశారు.హైదరాబాదును ప్రపంచస్థాయి నగరమని చెప్పి,పట్టుమని పది చినుకులు పడితే, నగరం మొత్తం చిగురుటాకుల వణికిపోవడం,చెరువుల ఆక్రమణతో కాలనీలు కాలనీలే మునిగిపోవడం ఒక సన్నివేశం.తాను సావు నోట్లో తలకాయపెట్టి ఒంటి చేత్తో తెలంగాణ సాధించినట్లు క్లెయిమ్ చేస్తున్న కేసీఆర్,అసలు సిసలు పోరాటయోధులైన నిరుద్యోగులను మరచిపోయినట్టు ఆరోపణలున్నవి అమరవీరుల కుటుంబాలను పట్టించుకున్న పాపాన పోలేదు. తనతో పనిచేసిన పాత సహచరులను,ఉద్యమకారులను,కవి,గాయక, కళాకారులను పట్టించుకోలేదు. ఉద్యమకారులను హేళన చేయడం,ఉద్యమాన్ని అణచివేయాలని చూసిన వారిని తన పక్కన పెట్టుకొని అందలం ఎక్కించడం విమర్శలపాలయింది. తెలంగాణ పేటెంట్ తమదే అన్న పార్టీ కాస్త తమ పార్టీ పేరులోనే ''తెలంగాణ పేరే లేకుండా" చేయడం సంచలన ఘటన.తమది జాతీయ పార్టీ అంటూ ప్రచారమూ చేసుకున్నారు. తెలంగాణ కవి అందెశ్రీని అవమానించడం,జయహో తెలంగాణ గీతాన్ని ఎక్కడ ఉపయోగించుకోకపోవడం తెలంగాణ గీతంగా ప్రకటించకపోవడం బిఆర్ఎస్ కు మైనస్ పాయింటు.

బిఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతి,అక్రమాలు,నేరాలన్నీ ఆ పార్టీ నాయకత్వాన్ని ఊపిరిసలపనివ్వడం లేదు.ఆయనా కేసులన్నీ రేవంత్ రెడ్డి చేతిలో 'మారణాయుధాలుగా' లభించినట్లు విశ్లేషణలున్నాయి.

> 2014 నుంచి కాంగ్రెస్,టిడిపి తదితర పార్టీలను తుడిచిపెట్టేందుకు కేసీఆర్ గట్టిగా ప్రయత్నించారు.బీజేపీ నుంచి భయం లేదని ఒక దశలో ఊహించారు.తీరా బండి సంజయ సారధ్యంలో ఆ పార్టీ పుంజుకోవడంతో బిఆర్ఎస్ అధినేత కలవర పడ్డారు. బండి సంజయ్ స్థానంలో కిషన్ రెడ్డి పార్టీ తెలంగాణ అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కేసీఆర్ ఊపిరిపీల్చుకున్నట్టు అప్పట్లో కథనాలు వచ్చాయి.కానీ రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్షుడవుతారని,ఆయన సునామీలా చుట్టుముడతారని,తన పీఠం కిందకు నీళ్లొస్తాయని కేసీఆర్ ఊహించి ఉండకపోవచ్చు.గతంలో కాంగ్రెస్ ను దెబ్బతీసే లక్ష్యంతో కొంతకాలం బిజెపి పుంజుకోవడానికి పరోక్షంగా సహకరించినట్టు ఆరోపణలున్నవి. బిజెపిని ఓవర్ టేక్ చేసి కాంగ్రెస్ పార్టీ అనూహ్యంగా బిఆర్ఎస్ ను చావు దెబ్బ కొట్టడం సంచలన సన్నివేశం.

> బీజేపీ నాయకత్వం బలహీనంగా ఉండడం,పలు కేసులు,కుంభకోణాలతో ఉక్కిరిబిక్కిరి అవుతూ బిఆర్ఎస్ 'చిక్కి శల్యమయి'పోతుండడం తమకు సానుకూల అంశంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నారు.మూడేండ్ల తర్వాత జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ముక్కోణపు పోటీ ఉంటుందని తేలిపోయినందున ఆ రెండు పార్టీలను దెబ్బకొట్టేందుకు గాను ఇప్పటి నుంచే 'బ్లూ ప్రింట్' తయారు చేసుకునే ప్రయత్నాల్లో సీఎం ఉన్నట్టు కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి.



- ఎస్.కే.జకీర్, సీనియర్ జర్నలిస్ట్

## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
9247580946

# ప్రజావాణి వినతుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వండి

■ బల్దియా కమిషనర్ చాహత్ బాజ్పాయ్



**వరంగల్ మహా;** ప్రజావాణి వినతులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించాలని జిడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్పాయ్ సూచించారు. బల్దియా లో సోమవారం ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమం సందర్భంగా బల్దియా ప్రధాన కార్యాలయం లోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్ లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ చాహత్ బాజ్ పయ్ ప్రజల నుండి దరఖాస్తు లను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తు లను మానవతా దృక్పథంతో క్షుణ్ణంగా పరిశీలించి సమస్యల పరిష్కార దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వినతులు పెండింగ్ లో పెట్టకుండా అధికారులు సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి లో స్వీకరించిన ఫిర్యాదుల వివరాలు విభాగాల వారిగా....

1.ఇంజనీరింగ్....26
2.హెల్త్ & సానిటేషన్.....14
3.ప్రాపర్టీ టాక్స్(రెవెన్యూ)...13
4.టౌన్ ప్లానింగ్...49
5.మంచినీటి సరఫరా, 06 6.హార్టికల్చర్..01

మొత్తం.... 109 గా అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి డి ఎఫ్ ఓ శంకర్ లింగం ఇన్చార్జి ఎస్ ఈ, సిటీ ప్లానర్ లు మహేందర్ రవీందర్ రాడేకర్ హెచ్ ఓ లు రమేష్ లక్ష్మారెడ్డి డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి ఎం హెచ్ ఓ డా.రాజేష్ హెచ్ ఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వెలివాడను చేరదీసి.. అక్షరాన్ని అక్కున చేర్చి..

■ కష్టజీవుల పిల్లలను అక్షరాల వైపు నడిపించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
■ ఫరూక్ నగర్ ఎంఈఓ మనోహర్ కృషితో పేద పిల్లలకు విద్య





**షాద్ నగర్, మహా:** ఆకలితో అలమటించడం తప్ప అక్షరం నేర్చుకోవడం తెలియని పిల్లలు.. అక్షరాల వైపు తమ పిల్లలను ఎలా నడిపించాలో కూడా తెలియని తల్లిదండ్రులు.. అలాంటి కడుపు పేద జీవులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్వయంగా కలుసుకున్నారు.. తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను బడికి చేర్చారు. స్వయంగా ఆటోలో పిల్లలతో పాటు కూర్చుని బడిదాకా ప్రయాణం చేశారు. షాద్ నగర్ పట్టణంలోని సిండికేట్ కాలనీలో సోమవారం కనిపించిన దృశ్యం ఇది. ప్రభుత్వ బడిని ప్రతి ఒక్కరికి చేరువ చేసి చదువు చెప్పించాలన్నది అగ్రనేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పం. అందులో భాగంగా గతంలో ఎన్నడూ లేనంతగా బడికిరాని పిల్లలను బడికి పంపించే కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టింది. ఇందులో భాగంగా నియోజకవర్గంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కుగా నిరుపేద పిల్లలను బడికి దగ్గర చేయాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. ఈ సందర్భంగా సిండికేట్ కాలనీలో వెలివాడ పేరిట గుడిసెలు వేసుకుని జీవిస్తున్న నిరుపేద జీవులను ఎమ్మెల్యే స్వయంగా కలుసుకున్నారు. అక్కడ బడికి రాని పిల్లలు, యాచకులుగా, పాత ఇనుప సామాన్లు, సీసాలు ఏరుకునే పిల్లలు ఉన్నారని గుర్తించారు. వారిని బడిలో చేర్పించాలన్న ఆలోచనతో తల్లిదండ్రులతో మాట్లాడి 25 మంది పిల్లలను ఆర్టీసీ కాలనీ లోని ప్రాథమిక పాఠశాలలో చేర్చారు. ఎంఈఓ మనోహర్ కూడా ఈ విషయంలో భాగస్వాములయ్యారు. బడికిరాని పిల్లల విషయంలో ఆయన కూడా ప్రత్యేక దృష్టి పెట్టడం విశేషం.

**చదువే భవిష్యత్తు..** చదివే ప్రతి ఒక్కరికి మంచి భవిష్యత్తును ఇస్తుందని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలే ఆణిముత్యాలుగా రూపొందుతారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చదువులకు చాలా ప్రాధాన్యతనిస్తున్నామని, చిన్నపిల్లలు ఇకనుంచి పనులు చేయకుండా బడికి మాత్రమే వెళ్లేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని, వారి తల్లిదండ్రులతో కూడా మాట్లాడతామని ఆయన పేర్కొన్నారు. ఏకీకృత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల పునరుద్ధరణ వంటి కార్యక్రమాలన్నీ చదువులను బాగు చేయాలనే ఉద్దేశంతోనే చేపడుతున్నామని ఆయన అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు పటిష్టంగా ఉంటే మధ్యతరగతి వర్గాలు కూడా అక్కడికే వస్తారని, ఫలితంగా వారి మీద ఫీసులు భారం చాలావరకు తగ్గుతుందని ఎమ్మెల్యే అన్నారు. బడికిరాని పిల్లలు ఎవరు దృష్టిలో ఉన్న తనకు సమాచారం ఇస్తే బడిలో చేర్పిస్తానని ఆయన అన్నారు. నిరుపేద కుటుంబాలలో ఉండే పిల్లలు చదువుకుంటేనే వారికి భవిష్యత్తు ఉంటుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పష్టం చేశారు. బడిబాట కార్యక్రమానికి సహకరించిన ఎంఈఓ మనోహర్ తదితర సిబ్బందిని ఎమ్మెల్యే శంకర్ అభినందించారు.

## ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ నిర్వహణతో..

# మహిళలు ఆర్థికంగా ఎదగాలి



**హన్మకొండ మహా ;** స్వయం సహాయక సంఘానికి చెందిన మహిళల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ విజయవంతంగా ఏడాది నిపూర్తి చేసుకోవడం అభినందనీయమని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలోని ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పంలో భాగంగా హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పలువురు మంత్రుల సమక్షంలో గతేడాది జూన్ 29వ తేదీన ప్రారంభించారని ప్రారంభోత్సవం నుండి ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ మహిళా సంఘం సభ్యుల ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహిస్తున్నారని ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ , ఇతర అధికారులతో కలిసి క్యాంటీన్ ను సందర్శించి నిర్వాహకురాలు నికితాంజలి బృందంతో సంభాషించారు. ముఖ్యంగా ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ద్వారా మహిళలు మరింత ఆర్థిక పురోగతిని సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం నికితాంజలి బృందం తో కలిసి కలెక్టర్ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, మెప్మా కోఆర్డినేటర్ రజిత రాణి, తదితరులతోపాటు ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

## తెలంగాణ మహిళల

# హ్యాండ్‌బాల్ జట్టుకు అభినందనలు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** గుజరాత్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూన్ 29 నుండి జూలై 3, 2025 వరకు భుజ్ (కచ్), గుజరాత్‌లో జరుగుచున్న 54వ సీనియర్ మహిళల జాతీయ హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్ 2025 లో పాల్గొనబోయే తెలంగాణ మహిళల జట్టుకు, తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, రంగారెడ్డి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ వెంకట్రామ్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ జట్టులో కెప్టెన్ సిహెచ్ నాగ సాయి హంసిక, వైస్ కెప్టెన్ కొమ్ము తనీషాలు, రంగారెడ్డి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ నుండి ఎంపిక కావడం గర్వకారణమని వారు తెలిపారు. ఛాంపియన్‌షిప్ లో విజయం సాధించి, రాష్ట్రానికి గౌరవం తీసుకురావాలని క్రీడాకారిణులను ప్రోత్సహించారు.

# కొండా సురేఖ శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేసి కేసు నమోదు చేయాలి



**వరంగల్ మహా;** గత అసెంబ్లీ ఎన్నికల్లో డబ్బులు ఖర్చు పెట్టి గెలిచామని ఎమ్మెల్సీ కొండా మురళి ఇటీవల ఓ వేడుకల్లో చేసిన బహిరంగ ప్రకటనను సుమోటోగా తీసుకొని కేసు నమోదు చేయాలని బిజెపి రాష్ట్ర నాయకులు, అర్బన్ కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2023 తెలంగాణ రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నికల్లో , ఎన్నికల నియమావళికి విరుద్ధంగా 70 కోట్లు ఖర్చు చేసి తన సతీమణి కొండా సురేఖను ఎమ్మెల్యేగా గెలిపించానని మంత్రి సురేఖ భర్త మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు బహిరంగంగా చేసిన వ్యాఖ్యలను సుమోటోగా తీసుకొని ఎన్నికల కమిషన్ కొండా సురేఖ శాసన సభ్యత్వాన్ని రద్దు చేయాలని, ఈ సందర్భంలో ప్రజలను కూడా అవమాన పరిచినట్టుగా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయని, ప్రభుత్వం కూడా వీటి పై స్పందించి పార్టీ పరంగా చర్యలు తీసుకోవాలని బిజెపి పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు వరంగల్ అర్బన్ కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు డిమాండ్ చేశారు.

# పేకాట స్థావరంపై ఎస్ఓటి పోలీసుల దాడులు



**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఊట్పల్లిలోని సదరన్ వెంచర్ ఖాళీ ప్రదేశంలో మూడు ముక్కలాట (పేకాట) ఆడుతున్న 13 మంది సభ్యులు గల ముఠాను ఎస్ఓటి పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 12 బైకులు, సెల్ ఫోన్లు 65,890 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు వారిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా ముందుకు

■ ఎమ్మెల్యే కాలె యాదయ్య



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రావులపల్లి సంకేనపల్లి గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు, ఎమ్మెల్యే కాలే యాదయ్య శంకుస్థాపన చేశారు. రంగారెడ్డి జిల్లా, శంకర్ పల్లి మండలం, రావులపల్లి గ్రామంలో బీటీ రోడ్ల నిర్మాణ పనులకు రెండు కోట్ల యాభై లక్షలు, సంకేపల్లి గ్రామంలో యాభై ఐదు లక్షల నిధులతో నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, చేవెళ్ల శాసనసభ్యులు కాల యాదయ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నిత్యం చేవెళ్ల నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం, నూతన ఆవిష్కరణలు, అభివృద్ధి కార్యక్రమాల పై ముందుకు వెళ్లడం జరుగుతుందని అన్నారు. రోడ్ల పనులను నాణ్యత ప్రమాణాలతో నిర్మించి, త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు కార్యకర్తలు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యంలో అర్హులందరికి ఇందిరమ్మ ఇల్లు

■ లబ్ధిదారులకు మంజూరి పత్రాలు అందజేసిన మేయర్, ఎమ్మెల్యే, కమిషనర్

**హన్మకొండ మహా ;** ప్రజాపాలన ప్రగతి పథంలో భాగంగా మహా నగర పాలక సంస్థ ఆధ్వర్యం లో వరంగల్ (పశ్చిమ) నియోజకవర్గ పరిధి లో సోమవారం హన్మకొండ లోని డా.బి ఆర్ అంబేద్కర్ భవన్ లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరి పత్రాల అందజేత కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, లతో కలిసి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఇందిరమ్మ ఇళ్లు మంజూరి ధృవ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం లో ప్రజాపాలనలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారికి ఎటువంటి అవినీతికి తావు లేకుండా అసలైన లబ్ధిదారులకు అందజేస్తామని, ఎన్నో ఏండ్లుగా నిరీక్షిస్తున్న పేద ప్రజల సొంతింటి కల ఈ ఇందిరమ్మ రాజ్యంలో నెరవేరిందని అర్హులైన లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందని ఎవరు ఆందోళన చెందనవసరం లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు కార్పొరేటర్ లు వేముల శ్రీనివాస్, మామిండ్ల రాజు, విజయ శ్రీ, రజాలే, డిప్యూటీ కమిషనర్ రవీందర్, హౌసింగ్ పి డి, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా యువజన కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం

■ యువతే భవిష్యత్తు.. కాంగ్రెస్ పార్టీలో యువతకు ప్రాధాన్యం
■ కొరివి పరమేశ్ ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ భారీ ర్యాలీ
■ యువజన కాంగ్రెస్ కు దిశానిర్దేశం చేసిన జక్కిడి శివసేన రెడ్డి, ఎమ్మెల్యే నాయిని



**హన్మకొండ మహా;** హనుమకొండ జిల్లా హంటర్ రోడ్డులోని కోడెం కన్వెన్షన్ హాల్‌లో జరిగిన వరంగల్, హనుమకొండ యువజన కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివసేన రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని వరంగల్ జిల్లా యువజనకాంగ్రెస్అధ్యక్షులుపరమేష్ , హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దిలీప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. మొదటగా వరంగల్ ఓ సిటీకి జక్కిడి శివసేన రెడ్డి చేరుకోగా వరంగల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొరివి పరమేష్ ఆయనకు గజ మాలతో స్వాగతం పలికారు. అనంతరం భారీ ర్యాలీని వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కోడెం హాల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథులు మాట్లాడుతూ దేశానికి మార్గనిర్దేశం చేసే శక్తి యువతలో ఉంది. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను, ఇందిరమ్మ ఆశయాలను కొత్త తరం యువతకు పరిచయం చేయాల్సిన బాధ్యత మన మీద ఉందని ప్రతి యువజన కాంగ్రెస్ కార్యకర్త, సోషల్ మీడియా నుంచి సర్వే బూత్ వరకు పార్టీని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించాలని తెలిపారు. పార్టీని నడిపించేది అనుభవం మాత్రమే కాదు, ఉత్సాహం, నిబద్ధత కూడా అని యువజన కాంగ్రెస్‌లో పని చేస్తున్న నాయకులకు రాబోయే రోజుల్లో పార్టీ ఆర్గనైజేషన్‌లో, ఎన్నికల రాజకీయాల్లో ముఖ్యమైన బాధ్యతలు ఇవ్వాలని మా సంకల్పం. స్థానిక స్థాయిలోనే కాకుండా మున్సిపల్, కార్పొరేషన్, అసెంబ్లీ స్థాయిలోనూ యువతకు ప్రాధాన్యత ఇవ్వడమే మా లక్ష్యమని మీ కృషికి తగ్గ గుర్తింపు ఖచ్చితంగా ఉంటుందని వారు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువతి యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


## ఉద్యమకారులకు ఇచ్చిన

# హామీ నిలబెట్టుకోవాలి




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఉద్యమకారులు అన్నారు. తెలంగాణ ఉద్యమకారులు దేశమొల్ల ఆంజనేయులు అన్నారు. టియుఎఫ్ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు, సోమవారం శంకపల్లి, మొయినాబాద్ మండలాలలో, ఉద్యమకారులు శాంతియుత దీక్షలు చేపట్టడం జరిగింది. తెలంగాణ ఉద్యమకారులు దేశమొల్ల ఆంజనేయులు ఈ దీక్షలలో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు అధికారంలోకి వస్తే తెలంగాణ ఉద్యమకారులను ఆదుకుంటామని హామీ ఇచ్చి, అధికారంలోనికి వచ్చిన తరువాత హామీని తుంగలో తొక్కడం చాలా బాధాకర మని అన్నారు. ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇస్తామని హామీ ఇవ్వడంతో పాటు కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పెట్టారని చెప్పారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా, ఉద్యమకారుకులకు ఇచ్చిన హామీని అమలు చేయక పోవడం ఉద్యమకారులను అవమానపర్చడమేనని పేర్కొన్నారు. స్థలం వస్తుందనే ఆశతో తెలంగాణ ఉద్యమకారులు కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపి అధికారంలోకి తీసుకువచ్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం ఇండ్ల స్థలాలు ఇవ్వకపోతే ఉద్యమకారుల సత్తా ఏమిటో ప్రభుత్వానికి చూపిస్తామని, మరో ఉద్యమానికి తెరలేపుతామని హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం, మొయినాబాద్ మండల మైపాల్, రమేష్, ముకుంద రెడ్డి, రాజేందర్, శంకర్పల్లి మండల అధ్యక్షుడు అశోక్, పద్మ, ప్రతాపరెడ్డి, పండిత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మున్నూరు కాపు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బుక్క వేణుగోపాల్ నియామకం



**రాజేంద్రనగర్ మహా ;** రాష్ట్ర మున్నూరు కాపు వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమితులైన బుక్క వేణుగోపాల్ ని శంషాబాద్ మున్సిపాలిటీ పరిధి ఊటుపల్లి లోని తన నివాసంలో సోమవారం మున్నూరు కాపు సంఘం సభ్యులు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు మల్చలం లింగమయ్య, సభ్యులు బిక్షపతి, వేణు, మహేష్, శ్రీకాంత్, బాబు, అనిల్, పొగాకు సిద్ధూ, రాజశేఖర్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సరైన పత్రాలతో వచ్చి సీజ్ చేసిన వాహనాలు తీసుకెళ్లండి



**భూపాలపల్లి, మహా :** జిల్లాలోని వివిధ కేసుల్లో పోలీసు స్టేషన్లలో సీజింగ్ లో ఉన్న 182 వాహనాలను, వెహికల్ కు సంబంధించి సరైనపత్రాలు, ఆధార్ కార్డు చూపించి వాహన యజమానులు తీసుకెళ్లాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహన రిజిస్ట్రేషన్ పత్రాలను సంబంధిత పోలీస్ స్టేషన్లో అందజేసి వాహనాలను తీసుకెళ్లాలని, వాహనాల జాబితా జిల్లా పోలీస్ వెబ్సైట్, ట్విట్టర్, లేదా ఎక్స్, ఫేస్ బుక్. లో పోస్ట్ చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. 6 నెలల లోపు తీసుకెళ్లకుంటే వేలం నిర్వహించనున్నట్లు ఎస్పీ కిరణ్ ఖరే తెలిపారు.

**బాధితుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు..** అనేక రకాల సమస్యలతో పోలీసులను ఆశ్రయించే బాధితులకు సత్వర న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. సోమవారం జిల్లా కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 26 మంది పిర్యాదుదారులతో ఎస్పీ కలసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ నడవడానికి ఇబ్బంది పడుతున్న ఫిజికల్లి ఛాలెంజ్ పర్సన్ దగ్గరకు స్వయంగా వెళ్ళి ఆయన సమస్య తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, ఫిర్యాదుల పూర్తి వివరాలు సమర్పించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రజాదివాస్ లో వచ్చే ఫిర్యాదులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడంతో పాటు, పెండింగులో లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

**సదానందం సేవలు స్ఫూర్తి దాయకం...** పోలీసు శాఖలో 42 ఏళ్లు సేవలు అందించి, సోమవారం పదవి విరమణ పొందిన ఆర్ ఎస్ ఐ కే. సదానందం సేవలు స్ఫూర్తిదాయకమని జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పదవి విరమణ పొందిన సదానందంను ఎస్పీ శాలువా, పులమాలలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ, ఎన్నో రకాల త్యాగాలతో పాటు కుటుంబాలకు దూరంగా ఉంటూ, ప్రజలకు సేవలందించడం ఎంతో గర్వకారణమన్నారు. ప్రతి ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పదని అన్నారు. విజయవంతంగా సర్వీస్ పూర్తి చేసిన అధికారుల సేవలను ఈ సందర్భంగా గుర్తు చేస్తూ వారి అనుభవం, సేవలు భవిష్యత్ తరాలకు ఎంతో స్ఫూర్తివంతంగా నిలుస్తాయని చెప్పారు. పదవీ విరమణ అనంతరం ఎలాంటి సమస్యలు ఎదురయినా తనను సంప్రదించవచ్చని అన్నారు. పదవి విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా వారి భావిజీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షినారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి అదనపు ఎస్పీ. ఏ. నరేష్ కుమార్, రిజర్వు ఇన్స్పెక్టర్ లు నగేష్, రత్నం, శ్రీకాంత్, పోలీసు అధికారుల నేత యాది రెడ్డి, పదవి విరమణ పొందిన సదానందం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# ప్రజావాణి దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలి

**■ వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్ మహా;** జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, డియార్వో విజయలక్ష్మి , జడ్పీ సీఈవో రామ్ రెడ్డి, డిఆర్డిఓ కౌసల్యాదేవి,ఆర్డీవోలు వరంగల్ సత్యపాల్ రెడ్డి,నర్సంపేట ఉమారాణి గార్లు పాల్గొని ప్రజలనుండి స్వీకరించారు. స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ త్వరగా పరిష్కరించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణి లో మొత్తం 130 దరఖాస్తులు రాగా ఎక్కువగా రెవెన్యూ 54, హౌసింగ్ 20 దరఖాస్తులు వచ్చాయని మిగతా శాఖలకు సంబందించిన దరఖాస్తులు 56 వచ్చాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత శాఖ అధికారుల దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారం లభించకపోవడంతో ప్రజావాణికి దరఖాస్తులు ఎక్కువగా వస్తున్నాయని, మీ పరిధిలో పరీక్షించవలసిన సమస్యలను పరిష్కరించి ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని సంబంధిత జిల్లా అధికారులకు సూచించారు. ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను ప్రాధాన్యతా క్రమంలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని అలాగే వ్యవసాయ, ఆరోగ్య, విద్యా శాఖ, తదితర శాఖలు శాఖపరమైన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి నిర్ణీత గడువులోగా పనులు చేయించాలని పనులపై పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేసి లక్ష్యాలను సాధించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, కలెక్టరేట్ పరిపాలన అధికారి విశ్వ ప్రసాద్ వరంగల్, ఖిలా వరంగల్ తహసిల్దార్లు ఇక్బాల్, నాగేశ్వర్ రావు, హార్టికల్చర్ అధికారి అనసూయ, డిబిసిడివో పుష్పలత,జిల్లా విద్యా శాఖ అధికారి జ్ఞానేశ్వర్,సంబంధిత అధికారులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ లో ప్రజలు భాగస్వాములు కావాలి

**■ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



**భూపాలపల్లి, మహా :** స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ (SSG) 2025 లో ప్రతి ఒక్కరు భాగస్వాములై గ్రామాల స్వచ్ఛతలో ముందుండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2025 (SSG 2025) కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కలిసి "ఒక అడుగు స్వచ్ఛత వైపు" అనే నినాదంతో గ్రామీణ ప్రాంతాల్లో శుభ్రత, పారిశుధ్యంపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. గ్రామీణ ప్రజలు యాప్ డౌన్లోడ్ చేసుకుని గ్రామాలలో పారిశుద్ధ్య కార్యక్రమాల పరిస్థితులపై అభిప్రాయాలను తెలియచేయవచ్చని పేర్కొన్నారు. ఇది గ్రామాల్లో శుభ్రతకు ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడంలో ప్రధానంగా ఉపయోగపడుతుందని అన్నారు. ప్రతి గ్రామ ప్రజలు ముందు కొచ్చి తమ గ్రామాన్ని మోడల్ స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. మీ అభిప్రాయమే మీ గ్రామ భవిష్యత్‌ను మారుస్తుందని, స్వచ్ఛతను అలవాటు చేసుకుని, ఆరోగ్యకరమైన జీవనాన్ని ముందుకు తీసుకెళ్లడంతో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్పష్టం చేశారు.

**ప్రజావాణి విజ్ఞప్తులను పరిష్కరించాలి..**

ప్రజావాణిలో వచ్చిన వినతుల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల వినతుల సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించి, పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 57 దరఖాస్తులు అందాయనీ, వాటి పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధతో పని చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజలు వ్యక్తపరిచిన సమస్యలను సున్నితంగా తీసుకుని, పెండింగ్‌లో ఉంచకుండా వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

**చెల్పూర్ మిల్లెట్స్ విక్రయించేందుకు ఏర్పాట్లు చేయాలి**

చెల్పూర్ మిల్లెట్స్ విక్రయాలు నిర్వహణకు ఐడిఓసి కార్యాలయంలో క్యాబిన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ డిఆర్డీఓకు సూచించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో చెల్పూర్ మిల్లెట్ యూనిట్ నిర్వహిస్తున్న మహిళలతో కలెక్టర్ ముకాముఖీ అయ్యారు. నేటి ప్రజల దైనందిన జీవనశైలిలో మిల్లెట్స్ వినియోగం ఆరోగ్య పరంగా ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుందని తెలిపారు. అందుకే చెల్పూర్ మిల్లెట్ యూనిట్ ద్వారా తయారు చేస్తున్న ఉత్పత్తులకు మార్కెట్ విస్తరణ అవసరమున్నదని, ఇందుకోసం ప్రత్యేకంగా కలెక్టర్ కార్యాలయంలో మిల్లెట్ క్యాబిన్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, డిఆర్డిఓ బాలకృష్ణ, ఆర్డిఓ రవి, ఎస్బిఎం కన్స్ ల్టెంట్స్ భాస్కర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి



**వరంగల్ మహా;** ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిర్మాణాలను వేగవంతం చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. సోమవారం రాయపర్తి మండల పరిధిలోని మైలారం, రాగన్న గూడెం గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ మెస్త్రీలు , కాంక్రీట్, సిమెంట్, ఇసుక, ఐరన్ రేట్లను లబ్ధిదారులకు ధర ఏమేరకు ఇస్తున్నారు అనే విషయాన్ని కాంట్రాక్టర్లతో మాట్లాడి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. గ్రామాల్లో పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం రాయపర్తి మండలంలోని తిరుమలాయపల్లి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. డార్మెటరీ, స్టోర్ రూమ్, కిచెన్, ప్లే గ్రౌండ్ తదితర వాటిని పరిశీలించారు. స్టోర్ రూమ్ లో నిల్వ ఉంచిన సన్నబియ్యం, ఇతర సరుకుల నాణ్యతను, విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ పట్టికలో పొందుపర్చిన వాటికి అనుగుణంగానే ఆహార పదార్థాలు ఉన్నాయా అని తనిఖీ చేశారు. మెనూ ప్రకారం అందిస్తున్నారా అని ఆరా తీశారు. భోజనం తయారు చేసేందుకు వినియోగించే ఆహార పదార్థాలు, సరుకులు, కూరగాయలు కలుషితం కాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వహకులకు సూచించారు. బాధ్యత కలిగిన వారు అందుబాటులో ఉంటూ.. పాఠశాల నిర్వహణను పక్కాగా పర్యవేక్షించాలన్నారు. విద్యార్థినులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో జడ్పీ సీఈవో, ఇందిరమ్మ ఇండ్ల నోడల్ అధికారి రామీ రెడ్డి, హౌసింగ్ పీడీ గణపతి, డి ఆర్ డి ఓ కౌసల్య దేవి, తహసీల్దార్, ఎంపిడిఓ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫరూక్ నగర్ అభివృద్ధికి కృషి



**షాద్‌నగర్, మహా:** రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ ప్రాంత మౌలిక అభివృద్ధికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకారం అందుతుందని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం ఫరూక్‌నగర్ కేంద్రంలోని 14వ వార్డులో స్థానిక నేత అందేమోహన్ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. 90 లక్షల రూపాయలతో ఫరూక్ నగర్ మెయిన్ రోడ్డు టు సిసి రోడ్డు గా వేసే క్రమంలో స్థానిక మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డితో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అదేవిధంగా మరో మూడు చోట్ల సుమారు 30 లక్షల రూపాయలతో సిసి రోడ్ల పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. ఈ ప్రాంత అభివృద్ధి కోసం యువ నాయకుడు అందే మోహన్ ఎల్లవేళలా కృషి చేస్తూ ప్రజలకు అండగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. ఈ ప్రాంతంలో నెలకొన్న అనేక సమస్యలు మౌలిక సదుపాయాల విషయంలో ఎప్పటికప్పుడు తన దృష్టికి అందేమోహన్ తీసుకురావడం అభినందనీయమని తెలిపారు. ప్రజల తరఫున వారికి అవసరమైన మౌలిక సదుపాయాల రూపకల్పన విషయంలో ఎప్పటికప్పుడు తనతో చర్చించి అభివృద్ధికి సహకరించడం పట్ల అభినందించారు. షాద్ నగర్ పట్టణంలో ఫరూక్ నగర్ ప్రాంత అభివృద్ధిని కూడా పట్టణంతో సమానంగా ముందుకు తీసుకువెళ్తామని అవసరమైన వార్డులకు అన్నిటికీ సరైన నిధులు ఇస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ తదితరులను అందేమోహన్ పెద్ద ఎత్తున సన్మానించారు. తన ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినందుకు కాంగ్రెస్ పార్టీ తరఫున వార్డు ప్రజల తరఫున ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, కమిషనర్ సునీత రెడ్డి, పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, చెంది తిరుపతిరెడ్డి, జమ్రుద్ ఖాన్, ముబారక్ ఖాన్, మొహమ్మద్ ఇబ్రహీం, పురుషోత్తం రెడ్డి, లింగారెడ్డిగూడెం అశోక్, గంద్రతి బాలరాజు గౌడ్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు..

# రెడీమిక్స్ ప్లాంట్లపై కొంగర వాసులు ప్రజావాణిలో ఫిర్యాదు

- **రెడీమిక్స్ ప్లాంట్లను ఇక్కడి నుంచి తరలించాలి**
- **అతివేగంతో ప్రమాదాలు జరుగుతున్నాయి స్థానికులు**
- **కలెక్టరేట్ వెళ్లే టీ జంక్షన్ వద్దనే మూడు ప్లాంట్లు**
- **గత నెల 27న ప్రమాదంలో గాయపడిన వ్యక్తి కోమాలో**
- **మహా పత్రిక కథనానికి గ్రామస్తుల స్పందన...**




మహా
రెడీమిక్స్ వాహనం ఢీకొట్టడంతో ప్రాణాపాయ స్థితిలో వ్యక్తి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** కొంగరకలాన్, రావిరాల గ్రామాలలో వెలసిన రెడీమిక్స్ ప్లాంట్లను, వేరొక చోటికి తరలించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణి లో కొంగరకలాన్ గ్రామస్తులు, మాజీ కౌన్సిలర్ కాకి నగేష్, గోపగల్ల రంజిత్ కుమార్ ఫిర్యాదు చేశారు. గత నెల 27న మోటార్ సైకిల్ పై వెళ్తున్న ధార మహేందర్ అనే వ్యక్తిని, రెడీమిక్స్ లారీ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో కోమాలోకి వెళ్లడం జరిగిందని, ప్రాణాపాయం స్థితిలో ఉన్నాడు. కలెక్టరేట్ వెళ్లే మార్గం టీ జంక్షన్ వద్ద రెడీమిక్స్ ప్లాంట్లు ఉండడంతో దుమ్ము ధూళి రావడం జరుగుతుందని, రెడీమిక్స్ వాహనాలు అతివేగంగా నడపడంతో, కలెక్టరేట్ కార్యాలయానికి వచ్చే ప్రజలు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారని, ఈ వాహనాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రమాదాలకు కారణమవుతున్న రెడీమిక్స్ ప్లాంట్లను ఇక్కడి నుంచి తరలించాలని కొంగరకలాన్ గ్రామస్తులు ప్రజావాణిలో అధికారులతో విన్నవించుకున్నారు. పరిపాలన నిమిత్తం ఇదే మార్గంలో అధికారులు... రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో పరిపాలన నిమిత్తం ప్రతిరోజు కలెక్టర్, అదనపు కలెక్టర్ ఇతర జిల్లా అధికారులు ఇదే మార్గంలో వెళ్తూ వస్తూ, ఇక్కడున్న సమస్యను నియంత్రించలేక పోతున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజల పట్ల దయతలచి ప్రమాదాలకు కారణం అవుతున్న రెడీమిక్స్ ప్లాంట్లను ఇక్కడి నుంచి తరలించి, వాహనాల వేగాన్ని నియంత్రించాలని జిల్లా అధికారులను వేడుకున్నారు.

**మహా పత్రిక కథనానికి గ్రామస్తుల స్పందన...**

రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ వెళ్లే టీ జంక్షన్ వద్ద జరిగిన ప్రమాదం పట్ల, మహా పత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన కొంగరకలాన్ గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలోని ప్రజావాణిలో రెడీమిక్స్ ప్లాంట్లను ఈ ప్రాంతం నుంచి తరలించాలని, మహా పత్రికలో వచ్చిన కథనం యొక్క ప్రతిని ఫిర్యాదుతో జత చేసి జిల్లా అధికారులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొంగరకలాన్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# పరిశ్రమలలో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించరాదు!



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** పరిశ్రమలలో నిబంధనల మేరకు అన్ని భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి సంగీత సంబంధిత అధికారులు, పరిశ్రమల యాజమాన్యాలకు సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, పరిశ్రమలు, అగ్నిమాపక, పోలీసు శాఖలతో పాటు జిల్లాలోని పరిశ్రమల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ... పరిశ్రమలలో మౌలిక సదుపాయాలు, ఫైర్ సేఫ్టీ, హెల్త్, మెడికల్ అండ్ హెల్త్ ఎంతో ముఖ్యమని అన్నారు. పెద్ద ప్రమాదాలు జరిగినప్పుడు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా పరిశ్రమలలో ఫైర్ సేఫ్టీ ఉందో లేదో తెలుసుకునేందుకు ఆకస్మిక తనిఖీలు చేయడంతో పాటు పనితీరును తెలుసుకోవాలని, అదే విధంగా ప్రమాదాలపై అవగాహన కల్పించేందుకు మాక్ డ్రిల్ చేపట్టి, ఇందులో స్థానికంగా ఉండే ప్రజలను భాగస్వాములను చేయాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. ఫైర్ సేఫ్టీ, పొల్యూషన్ కంట్రోల్ తప్పకుండా ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ ఇంచార్జి అధికారి యాదయ్య, జిల్లా అగ్నిమాప శాఖ అధికారి మురళీ మనోహర్ రెడ్డి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని అమలు చేయాలి




**హన్మకొండ, మహా;** ప్రజాస్వామ్యంలో మూల స్తంభాలలో నాలుగవ స్తంభం అయన జర్నలిస్టుల పై దాడులు చేస్తున్న వారి పై కఠిన చర్యలు తీసుకోకపోవడంతో దాడులు పునరావృతం అవుతున్నాయని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ అన్నారు. సోమవారం తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ హన్మకొండ జిల్లా కమిటీ ఎన్నిక జిల్లా కేంద్రంలో జరిగినది. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడుల నిరోధానికి ప్రభుత్వం ఒక ప్రత్యేకమైన చట్టాన్ని రూపొందించి అమలు చేయడం వల్ల దాడులను నివారించవచ్చునని సూచించారు. ప్రభుత్వం ఎప్పటి కప్పుడు తాత్కాలికమైన నిర్ణయాలు తీసుకోకుండా జర్నలిస్టుల సంబంధిత అవసరాలను పరిగణలోకి తీసుకొని ఒక సమగ్రమైన మీడియా పాలసీని రూపొందించి దేశానికే ఆదర్శంగా నిలవాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన తో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడంలో కీలక పాత్ర పోషించిన పత్రికలు, చానల్స్ సమస్యలపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు అదే విధంగా ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న స్థానిక పత్రికల ఎం ప్యానల్ ఎంపానెల్ మెంట్ వెంటనే చేపట్టి రుణభారంతో బ్రతుకులీడుస్తున్న పాత్రికేయులను ఆదుకోవాలని అన్నారు. ఇప్పుడు ఉన్న యూనియన్లు జర్నలిస్టుల సంక్షేమం కోసం కాకుండా తమ వ్యక్తి గత ప్రయోజనాలకే పరిమితమయ్యాయని ఆయన విమర్శించారు. అలా కాకుండా తాము ఒక ప్రత్యామ్నాయ జర్నలిస్టు ఉద్యమ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని అన్నారు. ఈ సందర్భంగా హన్మకొండ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హన్మకొండ జిల్లా కమిటీ జిల్లా అధ్యక్షుడిగా ముత్తోజు రాము, ప్రధాన కార్యదర్శిగా దొరి హరి కృష్ణ , కోశాధికారిగా గణపనేని చంద్ర శేఖర్, ఉపాధ్యక్షులుగా పబ్బు రాజ్ కుమార్, ఆర్.అరుణ్ కుమార్, సహాయ కార్యదర్శులు దాడి బిక్షపతి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా మంద సదానందం, బెల్లంపల్లి చరణ్ ,ఈసీ మెంబర్లుగా గోక శ్రవణ్, పొన్నాల సురేష్ లు ఎన్నికయ్యారు.

# నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

**షాద్ నగర్, మహా:** ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం సమితి ఆధ్వర్యంలో నారాయణ పాఠశాల ముందు ధర్నా తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి కార్పొరేట్ విద్యాసంస్థలైన నారాయణ మరియు చైతన్య విద్యాసంస్థల్లో కనీస వసతులు లేకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఈ విద్యాసంస్థల్ని తక్షణమే రద్దు చేయాలి అదే కాకుండా స్కూల్ లోపల బుక్స్ మరియు యూనిఫార్మ్స్ అమ్ముతూ అమాయకులైన తల్లిదండ్రుల దగ్గర నుండి వేల రూపాయలు తీసుకుంటూ చదువును వ్యాపారంగా మార్చిన ఇలాంటి కార్పొరేట్ విద్యాసంస్థలను తక్షణమే అధికారులు స్పందించి వారి యొక్క గుర్తింపును రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర 33 జిల్లాల్లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నారాయణ స్కూల్ ముందు ధర్నా నిర్వహించడం జరిగింది అదేవిధంగా మన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి దగ్గరనే విద్యాశాఖ ఉన్నప్పటికీ పుట్టగొడుగుల మొలుస్తున్న ఈ కార్పొరేట్ విద్యా విద్యాసంస్థలపై చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటు ఇకనైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కళ్ళు తెరిచి అనుమతి లేని కార్పొరేట్ విద్యా సమస్యలను తక్షణమే రద్దు చేసే విధంగా అధికారులకు సూచించాలని లేని యెడల ప్రభుత్వ కార్యాలయాల ముందు విద్యార్థి లోకాన్ని ఏకం చేసి ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నాము ఈ కార్యక్రమంలో షాద్ నగర్ సమితి సహాయ కార్యదర్శి సాయి చౌహాన్ విజయ్ కుమార్ ఆర్థిక్ నాయుడు గణేష్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

# తమ కల నెరవేరింది... పట్టా పొందిన భూమి ఇక ప్రభుత్వ భూమి



**రాజేంద్రనగర్ మహా ;** మాజీ సర్పంచ్ సిద్దేశ్వర ముదిరాజ్ శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రవేట్ హాల్ లో విలేకరుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శంషాబాద్ మండలం సుల్తాన్ పల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 129 ,142 లో గల 25 ఎకరాల 10 గుంటల భూమిని సుల్తాన్ పల్లి గ్రామస్తులు కోర్టులో పోరాడి పట్టా పాస్ బుక్కులు పొందిన వాటిని క్యాన్సల్ చేయించి ప్రభుత్వ భూమిగా కోర్టు నుంచి ఆర్డర్ పొందామని సుల్తాన్ పల్లి మాజీ సర్పంచ్ సిద్దేశ్వర ముదిరాజ్ సంతోషం వ్యక్తం చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా సర్వే నెంబర్ 129 , 142 లొ 25 ఎకరాల 10 గుంటల ప్రభుత్వ భూమిలో బోడవానికుంట శిఖం ఎఫ్టిఎల్ 14, 30 ఎకరాలు, ఇందిరమ్మ ఇళ్లకు 100 మందికి పట్టాలు గతంలో ఇచ్చారు. ఈ భూములలో చుట్టుముట్టు వ్యవసాయదారులు సొంత డబ్బులు వేచించి బోర్లు వేశారు. సుల్తాన్ పల్లి గ్రామస్తులకు తాగునీటికి సాగునీటికి ఉపయోగపడింది. అలాంటి భూమిని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులతో చెయ్యి కలిపి తమ గ్రామానికి సంబంధించిన కొందరు నేతలు వారితో కుమ్మక్కై అధికారులను తప్పుదోవ పట్టించి పట్టా పాస్ బుక్కులు పొందారు. సుల్తాన్ పల్లి గ్రామస్తులు ఈ భూమిపై సుదీర్ఘంగా పోరాటం సాగించారు. ఇట్టికేళ్లకు ప్రభుత్వ భూమిగా కోర్టు ఆర్డర్ ఇవ్వడంతో ఈ భూమి తమ గ్రామస్తులకు ప్రభుత్వానికి ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఒక్కరికి మా గ్రామం తరపున మా తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నసమని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దండు ఇస్తారి, లక్ష్మయ్య, మల్లికార్జున్, రాజు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులలో దేశభక్తి పెంపొందించాలి




**రాజేంద్రనగర్ మహా ;** బండ్లగూడ జాగీర్ మున్సిపల్ పరిధిలోని శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థులు ఆపరేషన్ సింధూర్ విజయ యాత్రని ర్యాలీని కళాశాల ప్రిన్సిపల్ కృష్ణ మోహన్ తో కలిసి రాజేంద్ర నగర్ ఇంటెలిజెన్స్ డిఎస్పి శ్రీధర్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. సింధూర్ విజయ యాత్ర పలు కూడలిలలో ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశం పట్ల గౌరవాన్ని పరిజ్ఞానాన్ని పెంపొందించాలన్నారు. దేశ సేవ పట్ల అంకితభావంతో పనిచేస్తున్న మన ఆర్మీ సత్తా ప్రపంచవ్యాప్తంగా కొనియాడుతన్నారు. ఆపరేషన్ సింధూర్ విజయ యాత్ర ర్యాలీ విద్యార్థుల దేశభక్తి ప్రదర్శనకు అద్భుత వేదికగా నిలిచిందన్నారు. విద్యార్థులు ప్లే కార్డులను ప్రదర్శిస్తూ దేశభక్తి నినాదాలతో ప్రజలను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెంకటస్వామి, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

# సాయిచంద్ రెండో వర్ధంతి సందర్భంగా కాంస్య విగ్రహం ఏర్పాటు

**షాద్ నగర్, మహా:** తెలంగాణ మలిదశ ఉద్యమ కళాకారుడు సాయిచంద్ రెండో వర్ధంతి సందర్భంగా వనపర్తి జిల్లా అమరచింత మండల కేంద్రంలో రజిని సాయిచంద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాంస్య విగ్రహాన్ని మాజీ మంత్రివర్యులు సిద్ధిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో మాజీ మంత్రులు వి శ్రీనివాస్ గౌడ్,నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి,ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్ రెడ్డి,ఆల వెంకటేశ్వర్ రెడ్డి,పట్నం నరేందర్ రెడ్డి,జైపాల్ యాదవ్,రాజేందర్ రెడ్డి,మాజీ ఐపీఎస్ అధికారి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్,ఎస్ రాజేందర్ రెడ్డి,ఎమ్మెల్యే గొంగిడి సునీత,మాజీ కార్పొరేషన్ ఛైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఖమ్మంలో మహా సమావేశం

**ఖమ్మంలో జరిగిన మహా పత్రిక తొలిసమావేశంలో ఎఎన్ఎన్ -మహా పత్రిక సీఈవో కంది రామచంద్రారెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహా పత్రిక బ్రోచర్లు ఆవిష్కరించారు. ఇపుడున్న పోటీ ప్రపంచంలో వార్తలు ఇన్ స్టంట్ గా అందించే మాధ్యమాలకే ఆదరణ ఉందని, మహా పత్రిక తక్కువ కాలంలో విశేష పాఠకాదరణ పొందిందని సిఈవో రామచంద్రారెడ్డి అన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ ఎడిటర్ గడ్డం క్రిష్ణమూర్తి, ఖమ్మం మహా బ్యూరో గడల నరసింహారావు, ఖమ్మం ఎఎన్ ఎన్ బ్యూరో ఉపేందర్, మహా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.**



## ఇంటి నిర్మాణ బిల్లులు మంజూరు చేయాలి

**ఆదిలాబాద్, మహా:** ఐటీడీఏ ఆధ్వర్యంలో సీసీడీపీ నిధులతో కొలాం, తోటి లబ్ధిదారుల కోసం నిర్మించిన ఇళ్లకు సంబంధించి బిల్లులను వెంటనే మంజూరు చేయాలని ఆదివాసీ పీవీటీజీ హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు.ఈ మేరకు సోమవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో సుమారు వెయ్యి ఇళ్లు మంజూరు కాగా లబ్ధిదారులు సొంత ఖర్చుతో, అప్పులు చేసి నిర్మించుకున్నారని తెలిపారు. 202324 ఏడాదిలో ఇంటి నిర్మాణాలు పూర్తయినప్పటికీ బిల్లులు మంజూరు కావడంలేదని లబ్ధిదా




రులు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం, ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని వెంటనే అందజేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కోకన్వీనర్లు కుడ్మెత తిరుపతి, మర్సుకోల బాపురావు, మేస్రం జైరాం, ఉపాధ్యక్షుడు టేకం వసంత్ రావు ఉన్నారు.

## జీపీఎఫ్, టీఎస్ జిఎల్ఐ బిల్లులను విడుదల చేయాలి

**ఆదిలాబాద్, మహా** ఉపాధ్యాయులకు సంబంధించి పెండింగ్ లో ఉన్న జీపీఎఫ్, టీఎస్ జీఎల్ఐ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సామ్యూల్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక డైట్ కళాశాలలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులతో తనిఖీ చేసే చర్యలను వెంటనే మానుకోవాలని స్పష్టం చేశారు. ఐటీడీఏ యాజమాన్యంలోని ఏజెన్సీ డీఈఓ పోస్టులను మంజూరు చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని తెలిపారు. పాఠశాలల్లో నిరూపయోగంగా ఉన్న ఆర్ఓ ప్లాంట్లను రిపేర్ చేసి, శుద్ధిచేసిన తాగు నీటిని అందించాలని పేర్కొన్నారు. జాతీయ నూతన విద్యా విధానం అశాస్త్రీయంగా, మూఢనమ్మకాలను ప్రోత్సహించే విధంగా ఉందని దేశంలో కుల వ్యవస్థను స్కిల్ యూనివర్సిటీల పేరుతో పునర్ నిర్మించే విధంగా



ఉందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే పనిలో భాగంగానే బడ్జెట్లో నిధులు తగ్గిస్తున్నాయని మండిపడ్డారు. విద్యా కమిషన్ కూడా ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ వారు ప్రభుత్వానికి ఇచ్చే సలహాలతో పేద ప్రజల పిల్లలు చదువుకునే బడులను ధ్వంసం చేసేలా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ నాయకులు శ్రీనివాస్, దిలిప్,వృకోధర్,నాగేందర్, సాయికాంత్,సంతోష్,నగేష్,శుద్ధోదన్,కిషోర్ పాల్గొన్నారు

## జీఓ నెం.49ను వెంటనే రద్దు చేయాలి

**ఆదిలాబాద్, మహా** షెడ్యూల్ ప్రాంత హక్కులను కాలరాస్తూ ఆదివాసీలను అడవికి దూరం చేసే విధంగా ఉన్న జీఓ. 49ను తక్షణమే రద్దు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం(టీఏజీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజర్శిషా కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2025 మే 30న తాడోబా, అందేరి రిజర్వ్ ఫారెస్ట్ తో కవ్వాల్ రిజర్వ్ ఫారెస్ట్ కలుపుతూ ఈ 49 జీఓ తీసుకొచ్చిందని తెలిపారు. కుంరం భీం జిల్లాలోని కాగజ్ నగర్, ఆసిఫాబాద్ పరిధిలో 334 గ్రామాలను గెజిట్ లో పేర్కొంటూ తీసుకొచ్చిన ఈ జీఓను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతం రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ ప్రాంతంలో ఉందని ఇక్కడ గ్రామ సభ, పెసా లాంటి గిరిజన చట్టాలను అమలు




పర్చకుండా ఎలాంటి సభలు నిర్వహించకుండా, ప్రజాభిప్రాయం కూడా తీసుకోలేదని తెలిపారు. ఇక్కడ ఈ రిజర్వ్ ఫారెస్ట్ చేపడుతున్న సందర్భంగా ప్రభుత్వం నుండి మంజూరైన ఇందిరమ్మ ఇండ్లు, త్రీ ఫేజ్ కరెంట్, ఇతర సదుపాయాలు అన్ని ఫారెస్ట్ అధికారులు ఆపేశారని గుర్తు చేశారు. ఈ జీఓ ప్రజాభిష్టానికి వ్యతిరేకంగా ఉన్నందున తక్షణం రద్దు చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆత్రం కిష్టన్న, నాయకులు కొట్నాక్ సక్కు, సిడాం మాధవ్, మరప కిష్టు, దడంజ దాసు, స్వామి, పోచక్క, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల హామీలు ప్రభుత్వం అమలు చేయాలి

### తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్

**ఆదిలాబాద్, మహా :** రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని సీఐటీయూ భవనంలో బండి దత్తాత్రి అధ్యక్షతన ఆదిలాబాద్ మండల రైతు సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన శోభన్ మాట్లాడారు. తెలంగాణ సమశీతోష్ణ వాతావరణం మూలంగా ఇక్కడ ఉత్పత్తి జరిగిన విత్తనాలు ఎక్కడైనా మొలకెత్తుతాయని తెలిపారు. విత్తన కంపెనీలు రైతులతో నోటిమాట అగ్రిమెంట్ తప్ప రాతపూర్వంగా అగ్రిమెంట్ చేసుకోవడం లేదని లేదు. కంపెనీలకు రైతులకు మధ్య ప్రమోటర్లతో వ్యాపారం సాగిస్తున్నారని పేర్కొన్నారు. వారు రైతులను మోసగించి కంపెనీలకు లాభం చేకూరుస్తున్నారని వివరించారు. విత్తనచట్టం లేకపోవడంతో నాణ్యత లేని, కల్తీ విత్తనాల వ్యాపారం వ్యవస్థీకృతంగా సాగుతోందని వివరించారు. పంటల బీమా, ప్రీమియంను జూలై 30లోపు ప్రభుత్వం కేంద్రానికి చెల్లించాలని అప్పుడు మాత్రమే ఫసల్ భీమా పథకం వర్తిస్తుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలల్లో వ్యవసాయ కూలీలు




దొరక్కపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చిన్న యంత్రాలను రైతులకు అద్దె కొనుగోలు పద్ధతిపై మండల స్థాయిలో కేంద్రం ఏర్పాటు చేయాలని తెలిపారు. చిన్న కమతాలలో రైతులు వినియోగించే విధంగా యంత్రాలను అందుబాటులో పెట్టాలని సూచించారు. రైతుల ఆదాయాన్ని పెంచడానికి ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలని, వ్యవసాయోత్పత్తులు పెరగడానికి సాగు చేసే రైతులకు భూములపై హక్కులు చట్టబద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. భూభారతి చట్టానికి రూల్స్ వచ్చినప్పటికీ నేటికి 15 లక్షల మందికి పాస్ పుస్తకాలు లేవని పేర్కొన్నారు. ఈ సదస్సులో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బండి దత్తాత్రి, దేవర్త స్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నేల స్వామి, లంక రాఘవులు, నాయకులు గంగన్న పాల్గొన్నారు.

## ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ రాజర్శి షా

**ఆదిలాబాద్, మహా:** సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజర్శి షా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో వివిధ శాఖల అధికారులతో కలిసి వినతులు స్వీకరించారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా శాఖల వారీగా 98 దరఖాస్తులు వచ్చాయని వీటిపై తక్షణమే స్పందించి పరిష్కరించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి



ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సమావేశం లో జిల్లా అదనపు కలెక్టర్ శ్యామల దేవి, శిక్షణ కలెక్టర్ సలోని చాబ్ర తదితరులు పాల్గొన్నారు.

# మృతులకు రూ. కోటి పరిహారం ఇవ్వాలి

### మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్

### ప్రమాద ఘటనపై ప్రభుత్వం చాలా నిర్లక్ష్యం

### ఆస్పత్రిలో క్షతగాత్రులకు బీఆర్ఎస్ నేత పరామర్శ

**సంగారెడ్డి, మహా:** పాశమైలారం పారిశ్రామికవాడలో జరిగిన అగ్ని ప్రమాద ప్రదేశాన్ని స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, ఇతర నాయకులతో కలిసి మాజీ మంత్రి హరీశ్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎస్డీఆర్ఎఫ్ బృందాలతో మాట్లాడి.. అక్కడ అందిస్తున్న సహాయక చర్యల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సిగచిలో పేలుడు సంభవించిందని, భూమి కంపించేంత శబ్దం వచ్చిందని అన్నారు. 149 మంది కార్మికులు ఉదయం పని చేశారని తెలిపారు. నాలుగు అంతస్తుల భవనం కుప్పకూలిందని, ఎనిమిది మంది చనిపోయారని చెప్పారు.

### ప్రభుత్వం చాలా నిర్లక్ష్యం..

సహాయక చర్యలు వేగంగా చేపట్టలేదని హరీశ్ రావు విమర్శించారు. ప్రమాదం జరిగిన వెంటనే చికిత్స అందిస్తే ప్రాణాలు దక్కేవని, రాష్ట్ర ప్రభుత్వం పూర్తి వైఫల్యం చెందిందని తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ. కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని తెలిపారు. బిహార్, ఛత్తీస్‌గఢ్‌తో పాటు తెలుగు వాళ్లు కూడా బాధితుల్లో ఉన్నారని చెప్పారు. కంపెనీలో పనిచేసే వారి



కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఘటనపై కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాద ఘటనపై ప్రభుత్వం చాలా నిర్లక్ష్యంగా ఉందని హరీశ్ రావు తెలిపారు. ఎంత మంది చనిపోయారన్న విషయంపై ఇంకా క్లారిటీ లేదని అన్నారు. డ్యూటీలో ఎంత మంది ఉన్నారనే విషయంపై ఒక్కొక్క అధికారి ఒక్కొక్క లెక్క చెబుతున్నారని తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులు తీవ్ర దుఃఖంతో ఉన్నారని అన్నారు.

## బీజేపీ ఫ్యూడల్ పార్టీ

### మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర విమర్శలు

**హైదరాబాద్, మహా:** బీజేపీ మరోసారి తన బీసీ వ్యతిరేక వైఖరిని స్పష్టంగా బయటపెట్టుకుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ రాజీనామా చేయడంపై ఆయన స్పందిస్తూ, ఆ పార్టీని ఒక ఫ్యూడల్ పార్టీగా అభివర్ణించారు. ఈ మేరకు సోమవారం ఆయన తన 'ఎక్స్' ఖాతా ద్వారా బీజేపీపై విమర్శలు చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం ఒక బీసీ నాయకుడు నామినేషన్ వేయడానికి ప్రయత్నిస్తే, ఆయనను నిరంకుశంగా అడ్డుకున్నారని పొన్నం ఆరోపించారు. నామినేషన్‌కు మద్దతు తెలిపిన వారిని సైతం భయభ్రాంతులకు గురిచేయడం బీజేపీ నియంతృత్వ ధోరణికి నిదర్శనమని ఆయన అన్నారు. "ముగ్గురు బీసీ ఎంపీలు, ఎందరో సీనియర్ నాయకులు ఉన్నప్పటికీ, బీసీలకు అధ్యక్ష పదవి ఇవ్వడానికి బీజేపీకి మనసొప్పలేదు. గతంలో బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని చెప్పి, కనీసం శాసనసభాపక్ష నేతగా కూడా అవకాశం ఇవ్వలేదు" అని పొన్నం విమర్శించారు. బీజేపీలో బీసీలకు ఎప్పటికీ న్యాయం జరగదని, ఆ పార్టీ నేతలే ఈ విషయంపై వాపోతున్నారని, దీనికి బీజేపీ అధిష్టానం ఏం సమాధానం చెబుతుందని ఆయన ప్రశ్నించారు. సామాజిక న్యాయం అనేది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. తమ పార్టీలో ముఖ్యమంత్రి రెడ్డి వర్గానికి చెందిన వ్యక్తి అయితే, పీసీసీ అధ్యక్షుడిగా బీసీ నేతకు అవకాశం కల్పించామని గుర్తుచేశారు.

## జిల్లాలో జూలై, ఆగస్టు నెలలో చేపలు పట్టుట నిషేధం

### జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్ అవినాష్

**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లాలో జూలై, ఆగస్టు నెలలో చేపల ప్రత్యుత్పత్తి జరుపు సమయంలో చేపలు పట్టుట నిషేధించినట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్ అవినాష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు, గోదావరి నది, అన్నారం, సుందిళ్ళ బ్యారేజ్ లు, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు, రాళ్ళవాగుముల్కల్ల, గొల్లవాగు ప్రాజెక్టుపోతనపల్లి, నీల్వాయి ప్రాజెక్టునీల్వాయిలలో చేపలు పట్టుట నిషేధించడం జరిగిందని, ఈ మేరకు రాష్ట్ర మత్స్యశాఖ ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని మత్స్యకారులు 1 జూలై, 2025 నుండి 31 ఆగస్టు, 2025 వరకు చేపల వేట




నిషేధం పాటించాలని, చేపల వేటకు వెళ్ళరాదని వెల్లడించారు. ఇట్టి నిబంధనలు ఎవరైనా ఉల్లంఘించినట్లయితే చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు.

## మహిళా శిశు సంక్షేమ శాఖకు అదనపు నిధులివ్వండి

### కేంద్ర మంత్రి అన్నపూర్ణాదేవికి విజ్ఞప్తి చేసిన మంత్రి సీతక్క

**హైదరాబాద్, మహా :** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సోమవారం కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణాదేవితో రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క భేటీ అయ్యారు. మహారాష్ట్ర నుంచి ఢిల్లీకి తిరుగు ప్రయాణమైన కేంద్ర మంత్రి కాసేపు శంషాబాద్ ఎయిర్ పోర్టులో ఉన్న క్రమంలో కేంద్ర మంత్రిని మహిళా సంక్షేమ శాఖ కార్యదర్శితో కలిసి సీతక్క పలు అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క రాష్ట్రంలో అమలవుతున్న పథకాల వివరాలతో కూడిన వినతిపత్రాన్ని కేంద్ర మంత్రికి అందజేశారు. ఆరోగ్యలక్ష్మి, పోషణ్ 2.0, సంక్షేమ అంగన్వాడీ వంటి పథకాల ద్వారా తెలంగాణలో మహిళా, శిశు సంక్షేమానికి ప్రభుత్వం అధిక నిధులు వెచ్చిస్తోందని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో లేని విధంగా అంగన్వాడీ ఉద్యోగులకు పదవీ విరమణ ప్రయోజనాలు కల్పిస్తున్న విషయాన్ని కేంద్ర మంత్రికి వివరించారు. అలాగే అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల జీతాల్లో కేంద్ర వాటాను పెంచాలని కోరారు. అంగన్వాడీ టీచర్లకు, హెల్పర్లకు రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ. 10,950, రూ.6450 చెల్లిస్తుండగా కేంద్రం తన వాటాగా నామమాత్రంగా కేవలం రూ. 2700, రూ.1350 మాత్రమే చెల్లిస్తుంది. ఈ మొత్తాన్ని పెంచాల్సిన అవసరాన్ని కేంద్ర మంత్రి కి సీతక్క వివరించారు.

# పెండింగ్ వేతనాలు చెల్లించాలి

### కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

**ఆదిలాబాద్, మహా** మధ్యాహ్న భోజన కార్మికులకు సంబంధించి పెండింగ్ లో ఉన్న బిల్లులను వెంటనే మంజూరు చేయాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి లింగాల చిన్నన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం చిన్నన్న మాట్లాడుతూ కార్మికులకు రావాల్సిన భోజన బిల్లులు నెలల తరబడి పెండింగ్ లో ఉండటం కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కార్మికులకు రూ. 10వేతనం అమలు చేయాలని స్పష్టం చేశారు. కోడిగుడ్లకు అదనంగా చెల్లించాలని లేనిపక్షంలో అంగన్వాడీ ల మాదిరి సరఫరా చేయాలని తెలిపారు.గ్యాస్ కు సబ్సిడీ ఇవ్వాలని, గుర్తింపు కార్డులు జారీ చేయాలని వివరించారు.మధ్యాహ్న భోజనం నిర్వహణను స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వకూడదని తెలిపారు. ఈ కార్యక్రమం లో కార్మికులు లక్ష్మి, సక్కుబాయి, ఇర్ఫాన, రజియా, భూదేవి తదితరులు పాల్గొన్నారు.



## సి.ఎం.ఆర్. లక్ష్యాలను వీలైనంత తొందరగా పూర్తి చేయాలి

### రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి డి.ఎస్.చౌహాన్

**మంచిర్యాల, మహా :** రాష్ట్రంలోని జిల్లాల వారిగా కేటాయించిన సి. ఎం.ఆర్. లక్ష్యాలను వీలైనంత తొందరగా పూర్తి చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి డి ఎస్ చౌహాన్ అధికారులకు సూచించారు. సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ సంచాలకులు ముజామిలాఖాన్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో సి.ఎం.ఆర్. లక్ష్యాల సాధన, రేషన్ కార్డుల జారీ, వచ్చే సీజన్ ధాన్యం కొనుగోలుకు ముందస్తు సన్నాహాలకు సంబంధిత అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఈ సీజన్లో రికార్డు స్థాయిలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో వరిధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు. లక్ష్యానికి మించి కొనుగోలు చేయడంతో బాధ్యత మనపై పెరిగిందని వెల్లడించారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో చౌకధరల దుకాణాల ద్వారా రేషన్ కార్డుదారులకు నిర్ణీత సమయంలో జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన సన్నబియ్యంను ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో 1 కోటి 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సి.ఎం.ఆర్. ప్రక్రియ పూర్తి చేయవలసి ఉందని అన్నారు. నెలకు కనీసం 9 లక్షల మెట్రిక్ టన్నులు డెలివరీ జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. బ్యాంక్ గ్యారంటీలు ఇచ్చిన రైస్ మిల్లులకు వరిధాన్యం కేటాయించాలని సూచించారు. వచ్చే సీజన్ లో వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు ముందస్తు సన్నాహక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్యాడీ క్లీనర్లు, ప్యాడీ డ్రయ్యర్స్, టార్పాలిన్లు ఇతర అవసరాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. రైస్ మిల్లర్లు తమ మిల్లుల సామర్థ్యాన్ని పెంపొందించుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. కొత్త రేషన్ కార్డుల కొరకు వచ్చిన దరఖాస్తులను సంపూర్ణంగా పరిశీలించి మంజూరు చేయాలని పేర్కొన్నారు.

## ఉద్యోగులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావు

**ఆదిలాబాద్, మహా** న్యాయస్థానంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావు అన్నారు. పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన స్టాఫ్ రూమ్ ను సోమవారం ఆయన ప్రారంభించారు. ప్రత్యేక పూజలు జరిపి భవనాన్ని ప్రారంభించిన అనంతరం అక్కడ అందుబాటులో ఉంచిన వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ 2023లో కోర్టు ఉద్యోగుల లంచ్ రూం కోసం హై కోర్టు నిధులు విడుదల చేసిందని తెలిపారు.



భవనం పూర్తి కావడంతో ప్రారంభించడం జరిగిందని అన్నారు. ఉద్యోగులకు ఇబ్బంది కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటూ తగిన సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు.

## లంబాడీలకు ఎస్టీ కుల ధ్రువపత్రాలు జారీ చేయాలి



**ఆదిలాబాద్, మహా** గిరిజన, మైదాన ప్రాంతాల్లో యాభై ఏండ్లుగా నివాసం ఉంటున్న లంబాడీలకు ఎస్టీ కుల ధృవీకరణ పత్రాలు జారీ చేయాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భరత్ చౌహాన్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. విద్యార్థులు, రైతులు, మహిళలతో కలిసి నిరసన చేపట్టి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా భరత్ చౌహాన్ మాట్లాడుతూ యాభై ఏండ్లకు పైగా నివాసం ఉంటున్న తమకు కుల ధృవీకరణ పత్రం ఇవ్వకపోవడం దారుణమని తెలిపారు. దీని వల్ల తమ పిల్లల భవిత ప్రశ్నార్థకంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నవోదయ, సైనిక్ స్కూల్లలో సీట్లు వచ్చినప్పటికీ కుల సర్టిఫికెట్ లేని కారణంగా వెళ్ళలేని పరిస్థితి నెలకొందన్నారు. తమ ఇబ్బందులను గుర్తించి కుల ధృవీకరణ పత్రాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జాదవ్ కృష్ణ నాయక్, మధుకర్, పరశురాం, చంద్రకాంత్ నాయక్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

## చిటుకూరి మల్లేష్ కు గౌరవ డాక్టరేట్ అవార్డు

### సింగరేణి ప్రోత్సాహం వల్లనే అతనికి కీర్తి




**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణానికి చెందిన చిటుకూరి మల్లేష్ అనే పారిశ్రామికవేత్తకు గౌరవ డాక్టరేట్ అవార్డు వరించడం పట్ల సింగరేణి ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత 12 సంవత్సరాలుగా సింగరేణి కాలరీస్ కంపెనీ బొగ్గు పరిశ్రమ ఇచ్చిన అవకాశాన్ని ఆయన సద్వినియోగం చేసుకున్నారు. ఇందులో భాగంగా శనివారం హైద్రాబాద్ నాంపల్లి తెలుగు విశ్వవిద్యాలయంలో **ఆపరేషన్ బిజినెస్ విభాగంలో** గౌరవ డాక్టరేట్ ను డిల్లీ యూనివర్సిటీ ప్రధానం చేసింది. మల్లేష్ గత 12 సంవత్సరాలుగా సింగరేణి అనుబంధ పరిశ్రమలో రూప్ బోల్ట్, కన్వేయర్ రోలాక్స్ తయారీ కంపెనీని విజయవంతంగా నిర్వహిస్తున్నారు. సింగరేణి కాలరీస్ కంపెనీ కార్మికుల పిల్లలు పరిశ్రమలు నడుపుకొనుటకు ఇచ్చిన అవకాశాన్ని ఆయన ఏకాగ్రతతో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు కాంట్రాక్టర్లు, సింగరేణి కార్మికులు చిటుకూరు మల్లేష్ ను అభినందించారు. గతంలో ఇతడికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరుపున టి ప్రైడ్ బెస్టు ఆంత్రీ ప్యూనర్ అవార్డును అందజేసింది. రానున్న రోజుల్లో సింగరేణి యాజమాన్యం మరికొన్ని సింగరేణి అనుబంధ పరిశ్రమలను స్థాపించుటకు కృషి చేయాలని సింగరేణి ఉద్యోగులు కోరుతున్నారు.

## పెండింగ్ లో ఉన్న వేతనాలు తక్షణమే జమ చేయాలి

### సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్

**ఆదిలాబాద్, మహా** పెండింగ్ లో కార్మికుల వేతనాలను తక్షణమే వారి ఖాతాల్లో జమ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులు గత మూడు నెలల నుండి పెండింగ్ వేతనాలు రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీలు అమలుచేయడం లేదని పేర్కొన్నారు. కార్మికుల ఖాతాల్లో ఒకటో తేదీన వారి అకౌంట్ లో వేతనాలు వేస్తామని కార్మికులకు అనేకసార్లు ప్రభుత్వం హామీ ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు.కానీ వారి ఖాతాల్లో ఇప్పటివరకు నయా పైసా కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. మల్టీపర్పస్ విధానం




తీసుకొచ్చిన తర్వాత గ్రామాలలో అనేక పనులు చేయిస్తోంది తప్పితే వారి సమస్య లు పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, గ్రామపంచాయతీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అత్రం సోపన్ రావు,వెంకట్రావు, అశోక్, లక్ష్మన్న నాయకులు ఇంద్రాజ్, నరేష్,రాకేష్,విలాస్, ప్రమోద్,శంకర్ గంగన్న, స్వామి, రవి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# శ్రీదేవితో పనిచేశా.. తన గురించి నాకు బాగా తెలుసు: పూనమ్ ధిల్లాన్

టాలీవుడ్ ప్రియుల గుండెల్లో అతిలోక సుందరిగా ముద్రవేసుకున్న హీరోయిన్ శ్రీదేవి. బాలీవుడ్‌తో పాటు తెలుగులోనూ స్టార్ హీరోయిన్‌గా మెప్పించింది. తాజాగా ఆమెపై మరో నటి, హీరోయిన్ పూనమ్ ధిల్లాన్ ప్రశంసలు కురిపించారు. అందరూ అనుకున్నట్లుగా తానేమీ తెలివితక్కువ వ్యక్తి కాదని తెలిపింది. తను చాలా అందమైన, అద్భుతమైన మనిషి అని అన్నారు. మీడియాలో చూపినట్లుగా మాటలు రాని వ్యక్తి కాదని పేర్కొన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూకు హాజరైన నటి పూనమ్ ధిల్లాన్.. శ్రీదేవిని ఉద్దేశించి ఇలా కామెంట్స్ చేశారు. నటి పూనమ్ ధిల్లాన్ మాట్లాడుతూ.. 'శ్రీదేవి చాలా తెలివైన నటి. మీడియా ఆమెను మాటలు రాని వ్యక్తిగా ముద్ర వేసింది. కానీ ఆమె అంత తెలివైనది కాదు. తనను అమాయకురాలిగా ముద్ర వేయడం అదంతా ఒక కుట్ర అని నేను చెప్తున్నా. ఎందుకంటే ఆమె చాలా తెలివిగల అమ్మాయి. అలా కాకపోతే ఆమె అంత అద్భుతమైన నటి ఎలా అవుతుంది? అందుకే శ్రీదేవి అమాయకురాలిగా నమ్మడాన్ని నిరాకరిస్తున్నా. నేను ఎల్లప్పుడూ ఆమె పనిని ఆరాధించేదాన్ని. తనతో కలిసి రెండు చిత్రాలలో పనిచేశా. శ్రీదేవి చాలా నిగ్రహం కలిగిన వ్యక్తి.' అని పంచుకుంది. కాగా.. శ్రీదేవి, పూనమ్ ధిల్లాన్ 'సోనే పే సుహాగా', 'జుదాయి' వంటి చిత్రాల్లో కలిసి పనిచేశారు. ఇక సినిమాల విషయానికొస్తే నటి పూనమ్ ధిల్లాన్ చివరిసారిగా రితేష్ దేశ్‌ముఖ్, తమన్నా భాటియా నటించిన 'ప్లాన్ ఎ ప్లాన్ బి'లో కనిపించింది. ఆమె జియో హాట్‌స్టార్ షో 'దిల్ బెకరార్'లో కూడా కనిపించనుంది.

# వరుస ఫ్లాప్స్.. ఏ డైరెక్టర్ నాతో పని చేయరని తెలుసు



టాలీవుడ్ హీరో మంచు విష్ణుకు హిట్టు పడి చాలా ఏళ్లే అయింది. ఆయన చివరగా జిన్నా మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. 2022లో రిలీజైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టింది. ఈసారి రొటీన్ సినిమాలు కాదని తన డ్రీమ్ ప్రాజెక్ట్ కన్నప్పను పట్టాలెక్కించాడు. దీనికోసం ఎంతో అధ్యయనం చేసిన తర్వాతే కన్నప్ప షూటింగ్ మొదలుపెట్టాడు. మోహన్‌బాబు, మోహన్‌లాల్, ప్రభాస్, అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్, శరత్ కుమార్ వంటి బడా తారలు కీలక పాత్రలు పోషించారు.

**కన్నప్పపై ట్రోలింగ్**

మహాభారత్, రామాయణ్ సీరియల్స్ తెరకెక్కించిన హిందీ దర్శకుడు ముకేశ్ కుమార్ సింగ్ (Mukesh Kumar Singh) ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేశాడు. జూన్ 27న థియేటర్లలో విడుదలైన ఈ సినిమాకు పాజిటివ్ టాక్ లభిస్తోంది. దీంతో సినిమా సక్సెస్ మీట్ కూడా నిర్వహించారు. ఈ వేడుకలో విష్ణు.. కన్నప్పపై జరిగిన ట్రోలింగ్ గురించి మాట్లాడాడు. కన్నప్ప సినిమా టీజర్ రిలీజైనప్పుడు ఉత్తి పుణ్యానికే నెగెటివిటీ ప్రచారం చేశారు. యూట్యూబ్‌లో నాన్నగారి గురించి, నా గురించి ఏమీ లేకపోయినా నెగెటివ్ థంబ్‌నైల్స్ పెడితే వారికి ఎక్కువ క్లిక్స్ వస్తున్నాయి, ఆదాయం వస్తోంది.

**వీఎఫ్ఎక్స్ గుర్తించలేకపోయారు**

అది ఎంత పెద్ద తప్పని వారు రియలైజ్ అవట్లేదు. లొకేషన్స్ బాలేవు, గ్రాఫిక్స్ బాగోలేవు అని నానామాటలు అన్నారు. చాలామందికి తెలియని విషయమేంటంటే నేను రిలీజ్ చేసిన మొదటి టీజర్‌లో చాలా తక్కువ వీఎఫ్ఎక్స్ ఉన్నాయి. రెండో టీజర్‌లో మాత్రం 70% వీఎఫ్ఎక్స్ ఉన్నాయి. అదెవరూ గుర్తించలేకపోయారు. మోహన్‌లాల్‌గారి ఎపిసోడ్‌లో ఆ బాణాలు తప్ప అన్నీ ఒరిజినలే! రియల్ లొకేషన్‌లో షూట్ చేశాం అన్నాడు.


**నాతో ఎవరూ చేయరు**

తెలుగులో లెజెండరీ డైరెక్టర్స్ ఉన్నా, హిందీలో ముకేశ్ కుమార్‌నే ఎందుకు నమ్మారు? ఆయనకే ఎందుకు డైరెక్షన్ బాధ్యతలు ఇచ్చారన్న ప్రశ్న ఎదురైంది. అందుకు విష్ణు స్పందిస్తూ.. నాతో తెలుగులో ఏ డైరెక్టర్ పని చేయరని నాకు తెలుసు. కన్నప్ప స్క్రిప్ట్ తీసుకెళ్తే ఎవరూ నాతో చేయరని అందరికీ తెలుసు. పైగా దీనికంటే ముందు నేను చేసిన రెండు,మూడు సినిమాలు కూడా పెద్దగా ఆడలేదు. అందువల్ల ఇక్కడ ఎవరూ చేయరు. మహాభారతాన్ని (సీరియల్) అంత గొప్పగా తీసిన ముకేశ్ కన్నప్పను అంతే అద్భుతంగా తెరపై చూపించగలరని నమ్మాను అని చెప్పాడు. ముకేశ్ కుమార్ సింగ్‌కు దర్శకుడిగా ఇదే తొలి సినిమా కావడం విశేషం!



# క్రేజీ కాంబినేషన్ షురూ

'కన్నప్ప' విజయంతో మంచి జోష్ మీద ఉన్నారు హీరో మంచు విష్ణు. కెరీర్ పరంగా ఆయనకు మరో విజయం ఎంతైనా అవసరం. అందుకే.. తన నెక్స్ట్ సినిమా వైపు దృష్టి సారించారాయన. తన తదుపరి సినిమా పూర్తి కమర్షియల్ ఎంటైర్టైనర్‌గా ఉంటుందని ఇప్పటికే ప్రకటించారు మంచు విష్ణు. తాజా సమాచారం ప్రకారం మంచు విష్ణు నెక్స్ట్ చిత్రానికి నటుడు, స్టార్ కొరియోగ్రాఫర్ ప్రభుదేవా దర్శకత్వం వహిస్తారని తెలుస్తున్నది. నువ్వొస్తానంటే నేనొద్దంటానా, పౌర్ణమి, శంకర్‌దాదా జిందాబాద్ చిత్రాలతో దర్శకుడిగా తెలుగు ప్రేక్షకులకు చేరువయ్యారు ప్రభుదేవా. హిందీలోనూ ఆయన కొన్ని చిత్రాలకు దర్శకత్వం వహించారు. డైరెక్షన్ విషయంలో కాస్త గ్యాప్ తీసుకున్న ఈ స్టార్ కొరియోగ్రాఫర్ మంచు విష్ణు సినిమాతో మళ్లీ తిరిగి మెగాఫోన్ పట్టనున్నారు. ఇంకా పేరు నిర్ణయించని ఈ సినిమా పూర్తి వినోదాత్మకంగా ఉంటుందని తెలుస్తున్నది. 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ సంస్థ నిర్మించే ఈ చిత్రం షూటింగ్ ఈ ఏడాదే మొదలుకానుంది.




# మరో ఇంట్రెస్టింగ్ మూవీతో వస్తున్న అల్లరి నరేష్..

టాలీవుడ్‌లో మంచి టాలెంట్ ఉన్న ఆర్టిస్ట్స్‌లో అల్లరి నరేష్ కూడా ఒకరు. నటన పరంగా ప్రాణం పెట్టి ప్రేక్షకులకి మంచి వినోదం పంచేందుకు ఎంతో ప్రయత్నిస్తుంటారు. తన నటనతో ఎంత నవ్వించగలడో అంతే రీతిలో ఏడిపించగలడు ఈ అల్లరోడు. ఒకప్పుడు కామెడీ సినిమాలే చేసిన అల్లరి నరేష్ ఇప్పుడు జానర్ మార్చి సాలిడ్ కంటెంట్ ఉన్న సినిమాలు చేస్తున్నాడు. ఇప్పుడు అల్లరి నరేష్ తన 63వ సినిమాతో బిజీగా ఉండగా, ఈ మూవీకి సంబంధించి క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్ . అల్లరి నరేష్ తన కెరీర్‌లో సెకండ్ ఇన్నింగ్స్‌ను విభిన్న కథలతో విజయవంతంగా ముందుకు నడిపిస్తున్నాడు. నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. తాజాగా ఆయన మెహర్ తేజ్ దర్శకత్వంలో ఓ నూతన చిత్రంలో నటిస్తున్నారు. ఇది అల్లరి నరేష్ కెరీర్‌లో 63వ చిత్రంగా రూపుదిద్దుకుంటోంది. ఈ రోజు అల్లరి నరేష్ పుట్టిన రోజు సందర్భంగా, సినిమా యూనిట్ టైటిల్ మరియు ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేసింది. ఈ సినిమాకు 'ఆల్కహాల్' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ పోస్టర్‌లో నరేష్ ఆల్కహాలిజం లో మునిగిపోయినట్టుగా కనిపిస్తున్నారు. ఇది ఒక భ్రమ, వాస్తవికత మధ్య నడిచే కథ అని అర్థమవుతోంది.

ఈ సినిమాను శ్రీకర స్టూడియోస్ సమర్పణలో, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్తో కలిసి సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ మరియు సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రుహాని శర్మ ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తుండగా, గిబ్రాన్ సంగీతాన్ని అందిస్తున్నారు. వివిధ భావోద్వేగాలతో నిండి ఉండే ఈ సినిమా, అల్లరి నరేష్‌కి మరో హిట్‌గా నిలవనుందని సినీ వర్గాలు ఆశిస్తున్నారు.ఇక ఈ రోజు అల్లరి నరేష్ బర్త్ డే కాగా, ఆయనకి సోషల్ మీడియాలో అభిమానుల నుండే కాక సినీ ప్రముఖుల నుండి కూడా పెద్ద ఎత్తున శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.

# రాజమౌళి కోసం ఒడిశా నృత్యం

రాజమౌళి సినిమా అంటేనే ప్రత్యేకతల సమాహారం. ఇతరుల చిత్రాల్లో కనిపించని ఏదో ఒక మ్యాజిక్ రాజమౌళి సినిమాల్లో ఉంటుంది. అందుకే ఆయన సినిమాలకు ప్రపంచవ్యాప్తంగా అంత క్రేజ్. ప్రస్తుతం ఆయన మహేష్‌బాబుతో సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. 'SSMB29' వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రంలో ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తున్నారు. రీసెంట్‌గా ఈ సినిమా రెండో షెడ్యూల్ ఒడిశా హిల్స్‌పై జరిగిన విషయం తెలిసిందే. అక్కడ షూటింగ్ జరపడానికి బలమైన కారణమే ఉందట. తాజా సమాచారం ప్రకారం ఒడిశా నేపథ్యం ఈ కథలో కీలకమట. అందుకే.. అక్కడ పేరెన్నికగన్న 'మయూర్ భంజ్ ఛౌ' అనే నృత్యాన్ని నేర్చుకోవాల్సిందిగా ప్రియాంక చోప్రాకి ఆర్డర్ పాస్ చేశారట రాజమౌళి. దాంతో ఈ నృత్యంలో ప్రసిద్ధి చెందిన ఒడిశా కళాకారుడు విక్కీ భర్తయ ఆధ్వర్యంలో ప్రియాంక చోప్రా ఈ నృత్యాన్ని అభ్యసించారు. మూడు విభిన్న రీతుల్లో ఈ నృత్యం ఉంటుందని సమాచారం. ఈ నృత్యం కథలో కీలకంగా ఉంటుందట. ప్రియాంకకు నృత్యం నేర్పిన భర్తయా రీసెంట్‌గా ఈ విషయాన్ని ప్రస్తావించారు. 'ప్రియాంకకు నృత్యం నేర్పడం గొప్ప అనుభవం. నృత్యాన్ని అభ్యసించడంలో ఆమె చూపించిన ఆసక్తి నిజంగా స్ఫూర్తిదాయకం. పెద్ద హీరోయిన్‌ని అన్న భావన తనలో ఎక్కడా కనిపించలేదు. ఈ ప్రతిష్టాత్మక ప్రయాణంలో నేనూ భాగం అయినందుకు సంతోషిస్తున్నా' అని తెలిపారు. ఆఫ్రికా అడవుల నేపథ్యంలో సాగే ట్రజర్ హంట్ మూవీ ఇదని ఇప్పటివరకూ వార్తలొచ్చాయి. ఇప్పుడేమో ఒడిశా నేపథ్యం అంటున్నారు. మరి వీటిలో నిజం రాజమౌళికే తెలియాలి.



# గూఫీ విషయాలు చెప్పేస్తున్నా..



ప్రస్తుతం రష్మిక మందన్న అంటే నేషనల్ క్రష్...మెగాస్టార్ చిరంజీవి సైతం తన అభిమానాన్ని దాచుకోలేనంటూ మాట్లాడేంత స్థాయికి ఎదిగిపోయింది. ప్రస్తుతం ఈ సౌత్ బ్యూటీ ఏం మాట్లాడినా, ఏం చేసినా సెన్సేషన్. వరుస విజయాల ఈ కథానాయిక పంచుకునే విశేషాల కోసం సోషల్ మీడియా నిరంతరం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తూ ఉంటుంది. ఈ నేపథ్యంలోనే... రష్మిక మందన్న తొలిసారిగా స్నాప్ చాట్‌లోకి అడుగుపెడుతున్నట్టు ప్రకటించింది. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాల తర్వాత అదే స్థాయిలో ఇండియన్ యువతను ఆకట్టుకుంటున్న స్నాప్‌చాట్ లో ఆమె ఖాతా తెరవడం అభిమానులకు మరిన్ని విశేషాలతో కనువిందు చేయడమే అనడంలో సందేహం లేదు. ఈ సందర్భంగా రష్మిక మాట్లాడుతూ "నేను ఎల్లప్పుడూ కొంచెం 'రా' గా( పచ్చిగా) కొంచెం వాస్తవంగా ఉండగలిగే ప్రదేశాలనే కోరుకుంటాను. అదే క్రమంలో ఇప్పుడు, స్నాప్‌చాట్‌లో ప్రవేశించాను. దీని ద్వారా నా తెర వెనుక క్షణాలు, నా చిన్న చిన్న ఆనందాలు కూడా పంచుకుంటాను. అంతేకాదు గూఫీ విషయాలు (చిన్న చిన్న పొరపాట్లు, తడబాట్లు, నవ్వు తెప్పించే చిరు తప్పిదాలు..వగైరా) కూడా. మధ్యలో ఉన్న ప్రతిదాన్ని (నా సోషల్ మీడియా బృందం చేసే ముందు కూడా) పంచుకునే సమయం ఇది. మీరు దీన్ని చూస్తుంటే, చాలా ధన్యవాదాలు, అభిమానులు ఇప్పటివరకు ప్రతిదానిలో అక్షరాలా భాగమయ్యారు వారికి ఇంకా ఎక్కువ సమయం అందివ్వడానికి నేను వేచి ఉండలేను. త్వరలో మిమ్మల్ని కలుస్తాను, నా ప్రేమికులారా "అని మందన్న ఈ ఆనందాన్ని వ్యక్తం వేచి చూద్దాం.. ఈ నేషనల్ క్రష్ ఉంటుందో...

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com